

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   బుధవారం 14 జూలై 2021 సంపుటి : 02 సంచిక :351 పేజీలు : 4 వెల : రూ 3-00


# కోవిడ్ వేరియంట్లపై పర్యవేక్షణ అనివార్యం



### ఈశాన్య రాష్ట్రాల సీఎంలకు మోదీ సూచన

న్యూఢిల్లీ: కోవిడ్ వేరియంట్లను ట్రాక్ చేయడంతో పాటు కరోనా వైరస్ మ్యుటేషన్‌పై కఠిన పర్యవేక్షణ తప్పనిసరని ప్రధాని నరేంద్ర మోదీ ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో కోవిడ్ పరిస్థితిని సమీక్షించేందుకు ఆయా రాష్ట్రాల సీఎంలతో ప్రధాని వర్చువల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మ్యుటేషన్, దాని ప్రభావంపై నిపుణులు అధ్యయనం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు జాగ్రత్తలు, తగిన చికిత్స కీలకమని అన్నారు. కోవిడ్ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. సామాజిక దూరం పాటించడం, మాస్క్ ధరించడం, వ్యాక్సిన్ తప్పనసరని అన్నారు. అదేవిధంగా టెస్టింగ్, ట్రాకింగ్, ట్రీట్‌మెంట్ వ్యూహం అనుసరించాలని, ఇది విజయవంతమైన వ్యూహంగా నిలిచిందని చెప్పారు.పర్యాటకం, వ్యాపారాలపై కోవిడ్ ప్రభావం ఉన్న విషయాన్ని ప్రధాని అంగీకరిస్తూనే, తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా హిల్ స్టేషన్లలో జనం గుమిగూడవద్దని హెచ్చరించారు. థర్డ్ వేవ్ రాకముందే ఎంజాయ్ చేయాలనుకునే వారి వాదనలను ప్రధాని తోసిపుచ్చారు. థర్డ్ వేవ్ తనంత తాను రాదని, ప్రజలే అందుకు కారణమవుతారనే విషయాన్ని ముందు గుర్తించాలని హితవు పలికారు. థర్డ్ వేవ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపైనే అంతా ఆలోచన చేయాలని ఆయన సూచించారు. నిర్లక్ష్యం, పెద్దఎత్తున జనం గుమిగూడటం వల్లనే కేసులు పెరుగుతున్నాయని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నారని అన్నారు.అందరికీ వ్యాక్సిన్ ఉచితంగా ఇస్తున్నందున వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధాని సూచించారు. కోవిడ్ వ్యాప్తి చెందే అవకాశాలున్నాయని అనుకున్న చోట సత్వర వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టాలని ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రధాని సూచించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఆరోగ్య మౌలిక వసతుల కల్పనకు ప్యాకేజీ ఉపకరిస్తుందన్నారు. అలాగే పడకల సంఖ్య, ఆక్సిజన్ సౌకర్యాలు పెంచడం వంటివి వేగవంతం చేయాలన్నారు. పీఎం కేర్స్ ద్వారా దేశంలో వందలాది ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పీఎం కేర్స్‌తో ఈశాన్య రాష్ట్రాల్లో 150 ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే వీలు కలిగిందని అన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రులకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. అలాగే కోవిడ్ నిరోధక టెస్టులు వేగవంతం చేయాలని, సమష్టిగా కరోనా వ్యాప్తిని ప్రజలు ఎదుర్కోగలరనే నమ్మకం తనకు ఉందని అన్నారు. రాష్ట్రాలకు అవసరమైన సహాయానికి కేంద్రం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన సమీ సమావేశంలో నాగాలాండ్, త్రిపుర, సిక్కిం, మేఘాలయ, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, అసోం ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా ఈ సమీ సమావేశానికి హాజరయ్యారు.

# డిజిటల్ లైబ్రరీలన్నీ ఈ ఏడాదే పూర్తి కావాలి: సీఎం జగన్



అమరావతి: గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీలు అన్నీకూడా ఈ ఏడాదే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జియో ట్యాగింగ్ చేసి నిర్మాణాల తీరుపై సమీక్ష చేయాలని తెలిపారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల్లో పలు కార్యక్రమాలపై మంగళవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ప్రాధాన్యక్రమంలో పనులు చేపట్టాలన్నారు. పల్లెలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమానికి పెద్దపీట వేయాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు.గ్రామాల్లో 14వేల ట్రైసైకిళ్లు ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ అంగీకారం తెలిపారు. అలాగే అర్బన్ ప్రాంతాలకు సమీపంలో ఉన్న పల్లెల్లో 1034 ఆటోలు ఏర్పాటు, వాటితోపాటు మరిన్ని వాహనాలను కొనుగోలుకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రూరల్ ప్రాంతాల్లో కూడా ఎక్కడైనా వెట్ వేస్టేజ్ ఉంటే దాన్ని తరలించేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఒక ప్రత్యేక నంబర్‌ను గ్రామాల్లో డిస్‌ప్లే చేయాలని, దానికి కాల్ చేయగానే సంబంధిత వాహనం ద్వారా వేస్టేజ్ సేకరించి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలని అధికారులకు సూచించారు. అపరిశుభ్రత, దోమలవల్ల రోగాలు వస్తున్నాయని అలాంటి పరిస్థితులను నివారించాలన్నారు. బలోపేతమైన పారిశుద్ధ్య కార్యక్రమాల వల్ల ప్రజారోగ్యం మెరుగుపడుతుందని, వైయస్సార్ జలకళ ప్రాజెక్టు చాలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు అని సీఎం జగన్ స్పష్టంచేశారు. లక్షలమంది రైతులకు ఉపయోగపడుతుందని, దానిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు.వైఎస్సార్ జలకళ ప్రాజెక్టు సమర్థవంతంగా ముందుకుసాగాలని, రాష్ట్రంలో చిన్నచిన్న నదులపై ఉన్న బ్రిడ్జిల వద్ద చెక్‌డ్యాం తరహాలో నిర్మాణాలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కనీసం 3-4 అడుగుల మేర అక్కడ నీరు నిల్వ ఉండేలా చేయాలని, తద్వారా భూగర్భజలాలు బాగా పెరుగుతాయని సీఎం తెలిపారు. దీనిపై ఒక కార్యాచరణ తీసుకురావాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బ్రిడ్జిల వద్ద ఈ నిర్మాణాలు చేయాలని, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ముగ్గురు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్, రెవిన్యూ, మున్సిపల్ శాఖ మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. సమగ్రసర్వేను ఉద్ధృతంగా చేయడంపై కమిటీ దృష్టిపెట్టనుందని సీఎం జగన్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పయ్యావుల ఆరోపణలు అర్ధరహితం

### ఆర్థిక మంత్రి బుగ్గన



అమరావతి జూలై 13 పీఏసీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ఆరోపణలు అర్ధరహితమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అన్నారు. మంగళవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సందేహాలు ఉంటే మీటింగ్ పెట్టి పరిష్కరించుకోవచ్చని.. లేఖలు రాయటం వల్ల ప్రయోజనం ఏంటో అర్థం కావట్లేదన్నారు. బిల్లులు లేకుండా డబ్బులు చెల్లించారన్నది అవాస్తవమని మంత్రి తెలిపారు. రూ.41 వేల కోట్లకు పూర్తి లెక్కలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అనవసర అనుమనాలు రేకెత్తిస్తున్నారాణి ఆడిట్ చేసినప్పుడు పలురకాల ప్రశ్నలు వేస్తారని.. ఆడిట్ సంస్థ ప్రశ్నలను ఆధారంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు.ప్రతిపక్షం నిజాలు తెలుసుకుని మాట్లాడాలని మంత్రి బుగ్గన హితవు పలికారు."సీఎఫ్ఎంఎస్ వచ్చాక ట్రెజరీ ద్వారా వ్యవస్థ నడవడం లేదు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే సీఎఫ్ఎంఎస్‌ను ప్రైవేటు వ్యక్తి చేతిలో పెట్టారు. 10895 కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్ లోపం వల్ల పీడీ అకౌంట్స్ నుంచి వెనక్కి వచ్చాయి. సీఎఫ్ఎంఎస్ ప్రోగ్రామింగ్‌లో లోపాలు ఉన్నాయి. తెలంగాణ వాటాపై ఏపీ అప్పు తెస్తుందంటూ ఆరోపణలు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంపై మనకు అప్పు ఎలా ఇస్తారు. పథకం ప్రకారం ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాల్జేయాలని కుట్రలు చేస్తున్నారని" మంత్రి బుగ్గన విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీసుకున్న అప్పును రెండు రాష్ట్రాలు కడుతున్నాయి. ప్రజలకు సబ్సిడీలు ఏమీ ఇవ్వకూడదని చంద్రబాబు అన్నారు. కోవిడ్ సమయంలోనూ 1.31 కోట్ల మందికి సంక్షేమం అందించాం. జీతాలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

# కేంద్రం అసమర్ధ విధానాలతోనే ధరల మంట : చిదంబరం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ అసమర్ధ విధానాలతోనే దేశంలో ధరలు మండిపోతున్నాయని, ద్రవ్యోల్బణం ఎగబాకుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పీ చిదంబరం ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోదీ సర్కార్ లోపభూయిష్టంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇంధన ధరలు, ఇతర వస్తువుల ధరలు చుక్కలు చూస్తున్నా




కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను తక్షణమే తగ్గించాలని, వీటిపై దిగుమతి సుంకాలను సమీక్షించాలని చిదంబరం మంగళవారం డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణానికి ప్రధాని నరేంద్ర మోదీయే నేరుగా బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వ తప్పుడు విధానాలు, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో చేతకానితనం వల్లే ధరలు మండుతున్నాయని వ్యాఖ్యానించారు. ధరల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

# బీసీల ఆత్మగౌరవం నిలబెట్టిన నాయకుడు సీఎం జగన్: సజ్జల



అమరావతి: బీసీల ఆత్మగౌరవం నిలబెట్టిన నాయకుడు సీఎం జగన్ అని, బలహీనవర్గాల ఎదుగుదల కోసం ఆయన కృషి చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ సంక్షేమ పాలనను చూసి కొంతమంది ఓర్వలేకపోతున్నారని అన్నారు. దుష్ప్రచారాలను మనందరం కలిసి తిప్పి కొట్టాలన్నారు. దేశంలోనే ఎన్నడూ లేనివిధంగా బిసిల ఆత్మగౌరవం నిలబెట్టిన నాయకుడు సీఎం జగన్ అని గుర్తుచేశారు. గత నాయకులు బలహీనవర్గాలను ఓటుబ్యాంకుగా చూస్తే, బలహీనవర్గాల ఎదుగుదల కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. సంప్రదాయ బద్దమైన రాజకీయాలు చేసి లబ్ది కోసం కాకుండా భావితరాల భవిష్యత్తు కోసం చూసే నాయకుడు సీఎం జగన్ అన్నారు.కొంతమంది చేయలేని పనులను సీఎం చేస్తుంటే రాజకీయ శూన్యంతో ఆరోపణలు చేస్తూ, పిచ్చిరాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారాలను మనమంతా కలిసి తిప్పికొట్టాలన్నారు. బీసీల్లోని 139 కులాలకు గొప్ప అవకాశం కల్పించారని గుర్తుచేశారు. ఈ అవకాశం ఉపయోగించుకొని సామజికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూసే వారికి మీ ఎదుగుదలే సమాధానంగా మారాలని సీఎం జగన్ ఆకాంక్ష అని చెప్పారు. బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సీఎం ఆకాంక్షకు అనుగుణంగా పనిచేయాలని కోరుకుంటున్నానని చెప్పారు.

# రాహుల్ గాంధీని కలిసిన ప్రశాంత్ కిషోర్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత రాహుల్ గాంధీని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ మంగళవారం కలిశారు. ఢిల్లీలోని రాహుల్ నివాసానికి స్వయంగా వెళ్లి కలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే ఏడాది జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ నేతలతో పీకే చర్చించనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు.కొద్ది రోజులుగా భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అతిపెద్ద రాజకీయ ఫ్రంట్ ఏర్పాటు కోసం వివిధ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోనే ఫ్రంట్ ఏర్పడుతుందని, కాంగ్రెస్ లేకుండా బీజేపీకి ప్రత్యామ్నాయ ఫ్రంట్ ఏర్పాటు సాధ్యం కాదని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సహా మరికొంత మంది నేతలు వ్యాఖ్యానించారు. ఈ ప్రయత్నాల్లో భాగంగానే రాహుల్‌ను పీకే కలిశారని ఓ వైపు వాదనలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం రాహుల్ గాంధీని పీకే ప్రశంసించడం, భవిష్యత్ నేత రాహులేనంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలాన్ని ఇస్తున్నాయి.బీజేపీయేతర పార్టీలు కొన్ని కొద్ది రోజులుగా ఢిల్లీలో సమావేశమవుతున్నాయి. శరద్ పవార్ నేతృత్వంలో ఇప్పటికే మూడుసార్లు సమావేశం అయ్యారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నప్పటికీ.. అధిష్టానం దీనిపై స్పందించలేదు. పీకే కొంత కాలంగా బీజేపీయేతర పలకు ఎన్నికల వ్యూహకర్తగా పని చేస్తూ వస్తున్నారు. ప్రతిపక్ష నేతలతో తరుచూ సమావేశమవుతున్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తాను ఇప్పుడు చేస్తున్న పనిని వదిలేస్తానని ప్రకటించినప్పటికీ పవార్, రాహుల్ గాంధీలతో తరుచూ సమావేశమవుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయడానికే ప్రస్తుతం చేస్తున్న పనిని పీకే పక్కనపెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ప్రపంచాన్ని వేగంగా చుట్టుముడుతోంది..

### 104 దేశాలకు వ్యాపించిన డెల్టా రకం.. WHO ఆందోళన



జెనీవా: కరోనా కొత్త రకం డెల్టా వేరియంట్ ప్రపంచ దేశాలను వేగంగా చుట్టుముడుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధిపతి టెడ్రోస్ అధనామ్ హెచ్చరించారు. ఇది భౌగోళిక ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ కరోనా రకం 104 దేశాలకు వ్యాప్తి చెందిందని చెప్పారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. ‹ప్రపంచవ్యా ప్తంగా వరుసగా గత నాలుగు వారాలుగా కరోనా కేసులు పెరుగుతున్నాయి. పది వారాల క్షీణత తర్వాత మృతుల సంఖ్యా పెరుగుతోంది. ప్రపంచ దేశాల్లో డెల్టా వేరియంట్ అత్యంత వేగంగా వ్యాపిస్తోంది. దాంతో కొత్త కేసులు, మరణాల్లో పెరుగుదల కనిపిస్తోంది. ఇప్పటికే ఇది 104 దేశాలకు వ్యాపించింది. త్వరలో భౌగోళిక ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. ఇప్పుడు మనం ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ఎదుర్కొంటున్నామని గుర్తుచేయాల నుకుంటున్నాను. వైరస్ ప్రజల జీవితాలు, జీవనోపాధి, ఆర్థిక వ్యవస్థల పునరుద్ధరణను మరింత గందరగోళంలో పడేస్తోంది. టీకా అందని ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అలాగే ఏ దేశంలోనూ మహమ్మారికి ముగింపు లభించలేదు› అని టెడ్రోస్ అంతర్జాతీయ సమాజానికి మరోసారి గుర్తు చేశారు.కరోనా దశలకు కారణమ వుతోన్న కొత్త వేరియంట్లు.. ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య, మరణాలను పెంచుతు న్నాయని టెడ్రోస్ అన్నారు. తొలి దశలో కరోనాను విజయవంతంగా కట్టడిచేయ గలిగిన దేశాలు ఇప్పుడు తీవ్ర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అలాగే దేశాలు ఆంక్షలు సడలించే సమయంలో వైద్య వ్యవస్థ, ఆరోగ్య కార్యకర్తలపై పడే ప్రభావాన్ని తప్పక దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. మరోవక్క కొన్ని పేద దేశాలుఆరోగ్య కార్యకర్తలు, ముప్పు పొంచి ఉన్నవర్గాలకు టీకాలుఅందించక ముందే.. ధనిక దేశాలు మిలియన్ల కొద్దీ బూస్టర్ డోసులకుఆర్డర్లు ఇవ్వడాన్ని ఆయన తీవ్రంగాపరిగణించారు.టీకా పంపిణీలోని అసమానతలపై ఆందోళన వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

బుధవారం 14 జూలై 2021

## రెంటికి చెడ్డ రేవడిలా ఏపీ

రాష్ట్రంలో ఏకచ్ఛత్రాధిపత్యం. ప్రజాదరణలో అందుకోలేనంత ఎత్తున అగ్రాసనం . నిత్యం జనం నీరాజనాలు. పంచాయతీ ఎన్నిక మొదలు పార్లమెంటు ఎన్నికల వరకూ ఏకపక్షమే. ప్రచారానికి వెళ్లకపోయినా తన పార్టీ వారికే పట్టం కడుతోంది ప్రజాతీర్పు. రాజకీయ ప్రత్యర్థులు దరిదాపుల్లో కనిపించడం లేదు. ఏ రాజకీయ పార్టీ నాయకుడికైనా ఇంతకు మించిన సౌలభ్యం, సౌఖ్యం ఉండవు. కానీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి పొరుగు రాష్టం నుంచి ప్రత్యర్థి వచ్చి పడ్డాడు. ప్రతిపక్షాలను ప్రజలు పెద్దగా విశ్వసించడం లేదని రూఢిగా తేలిపోయింది. కానీ ఈ కొత్త ప్రత్యర్థి విసిరే సవాల్ ప్రజల్లో తన పలుకుబడికి పరీక్ష పెడుతోంది. ఎంత సంయమనంగా ఉందామనుకున్నా అది చేతగానితనమనుకుంటారేమోననే భయం లోలోపల వెంటాడుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రూపంలో కునుకు పట్టనీయని సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ రెండు రాష్ట్రాల మధ్య దాయాది వైరం ఉంది. అభివృద్ధి, సంక్షేమం వంటి అన్ని విషయాల్లోనూ ప్రజల్లోనూ, నాయకుల్లోనూ , పార్టీల్లోనూ పోలిక వస్తోంది. ఏపీ, తెలంగాణల్లో ఎవరు ముందున్నారనే ప్రశ్న పదే పదే మీడియా చర్చలకు కారణమవుతోంది. చంద్రబాబు నాయుడి పట్ల తీవ్రమైన వ్యతిరేకతతో జగన్ మోహన్ రెడ్డికి ఎన్నికల సమయంలో కేసీఆర్ చాలా సహకరించారు. సామదానభేదోపాయాలతో తెలంగాణతో సంబంధం ఉన్న రాజకీయ నేతలను జగన్ కు సానుకూలంగా మలిచారు. హైదరాబాద్ కేంద్రంగా ఆంధ్రా రాజకీయ వేత్తలకు వ్యాపారాలు, పరిశ్రమలు ఉండటంతో కేసీఆర్ చెప్పినట్లు చేయకతప్పలేదు. చంద్రబాబు నాయుడనే ఉమ్మడి శత్రువును కలిసికట్టుగా ఓడించి ఇంటికి పంపించేశారు. అంతవరకూ బాగానే ఉంది. తాజాగా పరిస్థితులు తిరగబడ్డాయి. జగన్ సోదరి పార్టీ పెట్టడం, తెలంగాణలో ప్రత్యర్థి పక్షాలు బలం పుంజుకోవడంతో యాంటీ ఆంధ్రా సెంటిమెంటును మరోసారి తలకు ఎత్తుకోక తప్పని స్థితి కేసీఆర్ కు ఎదురవుతోంది. అందులో భాగంగానే ఏపీ వ్యతిరేకతను కనబరుస్తున్నారు. ఏపీలో జగన్ కు ఉన్నంతటి ప్రబలమైన జనాదరణ కేసీఆర్ కు తెలంగాణలో లేదు. నలభై శాతం ఓట్లు మాత్రమే టీఆర్ఎస్ తెచ్చుకోగలుగుతోంది. బీజేపీ, కాంగ్రెసు, ఇతర పార్టీల ఓటు షేర్ అరవై శాతం పైగా ఉంది. తప్పనిసరిగా పక్క రాష్ట్రంతో అవసరమైన సందర్భంలో అగ్గి పుట్టించుకోక తప్పదు. ఈ అనివార్యత కేసీఆర్ ను జగన్ కు పక్కలో బల్లెంలా మారుస్తోంది.కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు ఏపీ ముఖ్యమంత్రి పాలన విధానంపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం తాజాగా 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఏపీలో ఈ ఏడాది మొత్తానికి 10 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేయనున్నట్లు జగన్ జాబ్ క్యాలెండర్ ప్రకటించారు. ఏపీ లో నిరుద్యోగుల సంఖ్య తెలంగాణ కంటే ఎక్కువగా ఉంది. గతంలో హైదరాబాద్ లో ఏదో రకంగా ఉపాధి వెదుక్కునే సదుపాయం ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత క్రమేపీ అవకాశాలు కుదించుకుపోతున్నాయి. ప్రయివేటు కంపెనీలు కూడా స్థానికులకే పెద్ద పీట వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటు ప్రయివేటు ఉద్యోగాలకు ఆధారమైన పెద్దనగరాలు లేక, ప్రభుత్వ ఉద్యోగాలు కనుచూపు మేరలో కనిపించక అల్లాడిపోతున్నారు యువకులు. కేసీఆర్ ఉద్యోగ విధానాలతో తమ ప్రభుత్వ విధానాలను పోల్చుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగాల వంటివి కంటితుడుపు మాత్రమే తప్ప శాశ్వత ఉపాధి కాదనే భావన వ్యక్తమవుతోంది. ఈ అంశం జగన్ ప్రభుత్వంపై నిరసనకు, అసంతృప్తికి దారి తీసే సూచనలు కనిపిస్తున్నాయి.ఆనందంగా ఉన్నప్పుడు వరాలు ఇవ్వకూడదంటారు. అటువంటి సందర్భాల్లో మంచి చెడ్డలు, లాభనష్టాలను బేరీజు వేసుకునే మానసిక సమతుల్యత దెబ్బతింటుంది. గెలిచిన ఆనందంలో ఉమ్మడి రాజదానిగా ఉన్న హైదరాబాద్ లో పూర్తి హక్కులను జగన్ స్వచ్ఛందంగా వదిలేసుకున్నారు. సెక్రటేరియట్ ను పూర్తిగా తెలంగాణకు అప్పగించేశారు. ఇతర కార్యాలయాలు సైతం మూత వేసేసుకున్నారు. అదే సమయంలో పదో షెడ్యూల్ లోని 140 సంస్థలు, తొమ్మిదో షెడ్యూల్ లోని 70 సంస్థల ఆస్తులకు సంబంధించి విభజనపై ఎటువంటి హామీ తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం కేసీఆర్ దే పైచేయిగా మారింది. ఈ విషయం కూడా ప్రజల్లో చర్చకు పెట్టేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ తో తన రాజకీయ అవసరాలు తీరిపోవడంతో జగన్ కు సహకరించేందుకు కేసీఆర్ సిద్ధంగా లేరు. కృష్ణా జలాల పంపిణీపై చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెండువంతులు ఆంధ్రాకు, ఒక వంతు తెలంగాణకు సరఫరా చేసేందుకు ఒప్పుకున్న కేసీఆర్ ప్రస్తుతం అడ్డం తిరుగుతున్నారు. సగం, సగం పంచుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డి నిస్సహాయంగా మారిపోయారు. ఇది కచ్చితంగా ఆయనకు రాజకీయంగా నష్టం చేకూరుస్తుంది. ముఖ్యమంత్రి జగన్ బలహీనతను ప్రజల్లో చర్చకు పెట్టి ప్రతిపక్షాలు నిలదీసే అవకాశాలున్నాయి. ఆంధ్రా రాజకీయ పార్టీలకు అధికార వైసీపీ పై పోరాటానికి అవసరమైన అస్త్రాలను కేసీఆర్ సమకూరుస్తున్నారు. బలహీనంగా ఉన్న విపక్షాలు పోరాటం చేసేందుకు కొత్త ముడిసరుకును అందిస్తున్నారు.

# తమ్ముళ్లలో పెరుగుతున్న ధిక్కార స్వరం

విశాఖపట్టణం, జూలై 13, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీలో ఎన్నడూ చూడని సన్నివేశాలు ఇపుడు కనిపిస్తున్నాయి. ఒకపుడు చంద్రబాబు మాటే శిలాశాసనం. ఆయన ఏది చెబితే అదే ఫైనల్. చంద్రబాబు మాటను జవదాటాలంటే అది దుస్సాహసమే. కానీ 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన తర్వాత పార్టీలో కొట్టొచ్చినట్లుగా కనిపించే మార్పు ఏంటి అంటే క్రమశిక్షణారాహిత్యం. టీడీపీలో ప్రతీ వారూ నాయకులుగా మారిపోతున్నారు. అధినాయకత్వం ఒక నిర్ణయం తీసుకుంటే దాన్ని బాహాటంగా వ్యతిరేకిస్తున్నారు. ఇపుడు విశాఖ టీడీపీలో భీమిలీ సీటు పెద్ద పేచీనే పెడుతోంది.విశాఖ జిల్లాలో సీనియర్ నేతగా ఉన్న పాశర్ల ప్రసాద్ హఠాత్తుగా తన పదవికి రాజీనామా చేస్తామని చెప్పి అందరికీ షాక్ ఇచ్చేశారు. ఆ విధంగా ఆయన మీడియాకు ఎక్కడం వింత అయితే ఆయన్ని చంద్రబాబు నుంచి విశాఖ నాయకుల వరకూ అందరూ బుజ్జగించి దారికి తేవడం విడ్డూరం. నిజానికి టీడీపీలో ఇలాంటి సీన్లు ఎవరూ చూసి ఉండరు. కాంగ్రెస్ కల్చర్ గా వీటిని చెబుతారు. మొత్తానికి బడా నాయకులు అంతా పాశర్ల ఇంటికి వెళ్ళి నచ్చచెప్పి ఆయన రాజీనామా అస్త్రాన్ని విరమించుకునేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. ఈ మధ్య భీమిలీ సీటుకు టీడీపీ తరఫున ఇంచార్జిని చంద్రబాబు ప్రకటించారు. మాజీ ఎంపీపీ కోరాడ రాజబాబుని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో పాశర్లకు మండుకొచ్చింది అంటున్నారు. ఆయన భీమిలీ మీద కన్నేశారు. అటు చంద్రబాబు, ఇటు నందమూరి బాలయ్యల కనుసన్నలలో ఉంటూ సీటు కోసం కాస్తా గట్టిగానే కృషి చేస్తున్నారు. సబ్బం హరి మరణం తరువాత అక్కడ ఇంచార్జిని తానే అవుతాను అని భావించారు. కానీ సడెన్ గా రాజబాబుని ప్రకటించేసరికి షాక్ తిన్న పాశర్ల హై కమాండ్ కే షాక్ ఇచ్చేశారు అంటున్నారు. తాను టీడీపీలో ఉండలేనంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. టీడీపీకి ఆయువు పట్టు క్రమశిక్షణ. నిజానికి ఒక వైపు సీనియర్లు కొందరు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. జూనియర్లు కట్టు దాటుతున్నారు. కొన్ని సీట్లకు పోటీ చేయడానికి క్యాండిడేట్లు వెతుక్కోవాల్సి వస్తే మరి కొన్ని సీట్లకు మాత్రం పోటీ తీవ్రంగా ఉంది. అయినా ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉంది. ఈ లోగా ఎన్నో మార్పులు వస్తాయి. ప్రస్తుతానికి పార్టీ కార్యక్రమాలను చూడడానికి ఇంచార్జిలను నియమిస్తే ధిక్కరిస్తూ పాశర్ల లాంటి సీనియర్లు రచ్చ చేయడం తగునా అన్న మాట వినిపిస్తోంది. పాశర్లను బుజ్జగించడానికి చంద్రబాబు నుంచి పెద్ద నాయకులు రంగంలోకి దిగిపోయారు అంటే పార్టీ ఎక్కడికి పోతోంది అన్న ప్రశ్న కూడా వస్తోంది. ఇవాళ ఈయన ఇలా చేస్తే రేపు మరో ఆయన ఇదే విధంగా షాక్ ఇస్తారు, ఇలా ఎంతమందిని బుజ్జగిస్తారు, పార్టీలో క్రమశిక్షణ లేకుంటే పరిస్థితి ఎలా అన్నదే అందరికీ బెంగ పట్టుకుంది. మొత్తానికి టీడీపీలో ఎన్నడూ చూడని విచిత్ర వాతావరణం మాత్రం కళ్ళకు కడుతోందిపుడు. కానీ ఎవరూ ఏమీ చేయలేని నిస్సహాయతతో ఉన్నారన్నదే నిజం.

# వ్యాపారాల్లేక... తీవ్ర ఇబ్బందులు

రాజమండ్రి, జూలై 13, (న్యూస్ పల్స్)వైరస్ మహమ్మారి దెబ్బకు వ్యాపారాల కళ పూర్తిగా తప్పింది. నిత్యావసరాల కొనుగోలు తప్ప ప్రజలు మరి దేనిపైనా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఆదాయాలు గత మూడు నెలలుగా భారీగా అందరికి పడిపోవడంతో కొనుగోలు శక్తి ప్రజల్లో బాగా క్షీణించింది. దాంతో మార్కెట్ లు అన్ని కళావిహీనంగానే మారిపోయాయి. కేంద్ర ప్రభుత్వం షాపింగ్ మాల్స్ పై నిషేధం సడలించినా అక్కడక్కడా వైరస్ కేసులు సంబంధిత సిబ్బందికి వెలుగు చూస్తూ ఉండటంతో అవి మూత పడిపోతున్నాయి. రాజమండ్రిలో వాల్ మార్ట్ లో ఒకరికి వైరస్ సోకడం పరీక్షలు చేస్తే పదుల సంఖ్యలో మరికొందరి సిబ్బందికి పాజిటివ్ రావడంతో మాల్ హుటాహుటిన మూసివేశారు. వాస్తవానికి సాధారణ దుకాణాల కన్నా మాల్స్ లో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా సమస్యలు తప్పడం లేదు. బట్టల దుకాణాల నుంచి ఎలక్ట్రానిక్స్ షాపు ల వరకు కొనుగోలు దారులు కనిపించడం లేదు. అరకొరగా మాత్రమే వ్యాపారాలు నడుస్తున్నాయి. కనీసం సిబ్బంది వేతనాలకు, అద్దెలకు, కరెంట్ బిల్లులకు కూడా వచ్చే డబ్బులు చాలడం లేదని పలువురు వ్యాపారులు వాపోతున్నారు. దీనికి తోడు వైరస్ భయం వెంటాడుతుంది. కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఉండటంతో షాప్ లు తీయాలా మూయాలో తెలియక అయోమయంలో ఉన్నారు వ్యాపారులు. బేరాలు లేవని మొత్తం షాప్ లు బంద్ చేస్తే మొత్తం రొటేషన్ పోతుందని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క వ్యాపారాలు సక్రమంగా లేకపోవడంతో జీతాలు చెల్లించలేక చాలామంది ఉద్యోగులను తొలగిస్తున్నారు. దాంతో ఉపాధి కోల్పోయినవారు కొత్త ఉద్యోగాలు దొరక్క ఉన్న ఉద్యోగం కోల్పోయి అల్లాడుతున్నారు. ఇక సెలూన్స్ షాప్ లవారు ఇదేపరిస్థితి ఎదుర్కొంటున్నారు. పని చేస్తే వైరస్ భయం చేయకపోతే రోజు గడవని పరిస్థితి తో దిక్కుతోచని స్థితి లో ఉన్నారు.

# కొల్లేరు అభయారణ్యానికి మొక్కుబడిగా చెక్ పోస్టులు

ఏలూరు, జూలై 13, (న్యూస్ పల్స్) కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దులో సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లేరు సరస్సు 11వ శతాబ్ద ప్రాంతంలో ఒక పట్టణం. 17వ శతాబ్దం వరకూ ఇక్కడ మనుషులు సంచరించారు. అయితే తెలుగు రాజుల కాలంలో కొల్లేరు పట్టణం దగ్ధమైపోయినట్లు చరిత్ర చెబుతోంది. తదనతంరం పెద్దగొయ్యిగా ఏర్పడి, గోదావరి, కృష్ణా నదుల నుంచి వచ్చే అదనపు నీరు, వరదల నీటితో ఈ ప్రాంతం ముంపునకు గురైంది.సముద్రమట్టానికి 10 అడుగుల ఎత్తు వరకూ సుమారు 314 చ.మైళ్ల విస్తీర్ణంలో నీరు నిలబడి ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఒక సరస్సుగా గుర్తించి, కొల్లేరు సరస్సుగా నామకరణం చేశారు. ఇలా 18వ శతాబ్దం ప్రారంభంలో కొల్లేరు సరస్సుగా ఏర్పడింది. సరస్సులో వివిధ రకాల చేపలు, కలువ కాయలు(కలేబికాయలు), నాచు కాయలు ఇలా ఎన్నో రకాల మొక్కలు నీటిలోంచి పుట్టుకువచ్చి కాయలు కాస్తుండేవి. ఆ కాయల్ని తినేందుకు విదేశాల నుంచి 200 రకాలకు పైగా పక్షులు వలస వచ్చేవి. వీటితో పాటు స్థానిక పక్షులు లక్షలాదిగా కొల్లేరులో జీవించేవి. అయితే రానురాను పక్షులు ఇక్కడ మనుగడ సాగించే పరిస్థితులు కానరావడం లేదు. కొల్లేరు అభయారణ్య పరిరక్షణకు గత ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా ఆచరణకు నోచుకోలేదు. కొల్లేరుతో పాటు ఐదో కాంటూర్‌ను పరిరక్షించడానికి నిత్యం పహారా కాయాల్సిన యంత్రాంగమే చోద్యం చూస్తోంది. ఫలితంగా ఒకనాడు కొల్లేరులో తిరుగుతున్న తిమింగాల్ని సైతం లెక్కచేయకుండా బాంబులతో పేల్చేసిన చెరువుల స్థానంలో నేడు పుట్టగొడుగుల్లా కొత్త చెరువులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. అడపాదడపా దాడుల పేరుతో ఎంపిక చేసుకున్న వారిని భయభ్రాంతులకు గురిచేసి, కాసులు దండుకోవడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.ఆటపాకలోని రక్షిత పక్షుల కేంద్రంలో కూడా పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వందలాది విదేశీ పక్షులు మృత్యువాత పడుతున్నాయి. సాక్షాత్తూ అటవీశాఖ అధికారుల కళ్లముందే ఈ దారుణం జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పక్షుల కేంద్రంలో యంత్రాలతో అభివృద్ధి పనులు చేయకూడదనే నిబంధన ఉన్నా అమలు కావడం లేదు. పక్షులు సంచరించే ప్రాంతాల్లో విచ్చల విడిగా చేపలు, రొయ్యల చెరువులు పుట్టుకొస్తుండటంతో మేత, యాంటి బయోటిక్స్ విని యోగం విచ్చలవిడిగా జరుగుతూ పక్షుల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతున్నాయి. ఏటా వేసవిలో కొల్లేరులోని వందలాది ఎకరాల్లో కిక్కిస దగ్ధమవుతోంది. కిక్కిస మంటల్లో వేలాది పక్షులు, పక్షి గుడ్లు మాడిమసైపోతున్నాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల కొల్లేరు కుచించుకుపోతోంది. సరస్సు మనుగడకు ప్రమాదం ఏర్పడింది. అంతరించే స్థాయికి పక్షులు చేరుకున్నాయి. కొల్లేరు కిలకిల రావాలు వినాలంటే, సరస్సు మనుగడ కాపాడాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు సరస్సుపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.కొల్లేరు సరస్సులో జలాలు కనుమరుగవుతున్నాయి. కొల్లేరు ప్రాంతం నెరలు తీసి బీడు బారుతోంది. వివిధ రకాల ఫ్యాక్టరీలకు చెందిన రసాయన వ్యర్థాలతో కూడిన నీరు కొల్లేరులో చేరుతోంది. దీంతో పక్షులు చనిపోతున్నాయి. వాటి కళేబరాలు పచ్చిక పొదల్లో పడి కుళ్లి కృశించిపోతున్నాయి. ఇలా మృత్యువాత పడుతున్న వాటిలో ప్రసిద్ధిగాంచిన విదేశీ పెలికాన్ పక్షులూ ఉన్నాయి. కొల్లేరు అభయారణ్యాన్ని పరిరక్షించేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మొక్కుబడిగా ఉన్నాయి. అభయారణ్య పరిధిలో కృష్ణా జిల్లాలో రెండు, పశ్చిమగోదావరి జిల్లాలో 4 చెక్ పోస్టులున్నాయి. చేపల మేత, మందులు, వాహనాల రాకపోకల నిషేధంతో పాటు, కొల్లేరు పక్షుల్ని రక్షించాల్సిన బాధ్యత చెక్‌పోస్టు అధికారులు, సిబ్బందిపై ఉంది. వీరు సరిగా పట్టించుకోనందున అభయారణ్యంలోకి వెళ్లకూడనివన్నీ వెళ్లిపోతున్నాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సీమలో తమ్ముళ్ల మౌనం

తిరుపతి, జూలై 13, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ రాయలసీమలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. దీనికి తోడు ఇప్పుడు నీటి వివాదం ఆ పార్టీని మరింత ఇబ్బంది పెట్టేవిధంగా మారింది. రాయలసీమలో తెలుగుదేశం పార్టీ గత ఏడేళ్లుగా బలహీనంగా ఉంది. 2014 ఎన్నికల్లోనూ పెద్దగా ఇక్కడ ఫలితాలు దక్కలేదు. 2019లో జరిగిన ఎన్నికల్లో అయితే రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో తెలుగుదేశం పార్టీకి దక్కింది కేవలం మూడు సీట్లే. అవి చంద్రబాబు, బాలకృష్ణ, పయ్యావుల కేశవ్ లు మాత్రవే గెలిచారు.రాయలసీమలో తెలుగుదేశం పార్టీకి బలమైన నేతలున్నారు. పేరున్న నేతలే పదుల సంఖ్యలో ఉన్నారు. సుదీర్ఘకాలం నుంచి వారు రాజకీయాల్లో ఉన్నవారే. అయితే రాయలసీమ ఎత్తిపోతల పథకం, రాజోలి బండ వివాదాలు ఇప్పుడు తెలుగుదేశం పార్టీని ఇరకాటంలోకి నెట్టాయి. రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే ఆ ప్రాంతానికి సాగు, తాగు నీటి సమస్య చాలా వరకు తీరుతుంది. అయితే ఇది పూర్తయితే క్రెడిట్ మొత్తం జగన్ కే దక్కుతుంది.ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య ఈ వివాదం మరింత ముదురుతుంది. ఇది వైసీపీకి అడ్వాంటేజీగా మారుతుంది. వైసీపీ రాయలసీమ నేతలంతా గొంతెత్తుకుని అరుస్తున్నారు. కానీ తెలుగుదేశం పార్టీ నేతలు మాత్రం ఈ వివాదం పై నోరు మెదపడం లేదు. తమ ప్రాంతానికి దక్కుతున్న ప్రయోజనాన్ని అడ్డుకుంటున్న తెలంగాణ ప్రభుత్వంపై ఏమీ అనలేకపోతున్నారు. ఈ వివాదంపై ఎవరూ ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశించడమే కారణం.ఈ వివాదం కేసీఆర్, జగన్ లు సృష్టించినవేనన్నది చంద్రబాబు నమ్మకం. తమను మరింత బలహీన పర్చేందుకు వారిద్దరూ ఆడుతున్న గేమ్ గా చంద్రబాబు అనుమానిస్తున్నారు. అందుకే ఈ వివాదంపై ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని చంద్రబాబు కొంత కటువుగానే నేతలకు చెప్పారట. దీంతో రాయలసీమ తెలుగుదేశం నేతలు ఈ వివాదంపై మౌనంగానే ఉన్నారు. ఇది తమకు భవిష?యత్ లో నష్టం చేకూరుస్తుందని వారు చెబుతున్నారుమైనస్..ప్లస్ పై అంచనాలుతెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు స్ట్రాటజీయే వేరు. ఒకచోట మైనస్ లో ఉన్నా, మరోచోట ప్లస్ లోకి పార్టీని తీసుకెళ్లాలని ఆయన ఎప్పటికప్పుడు తమ వ్యూహాలను అమలు చేస్తుంటారు. రాయలసీమలో తెలుగుదేశం పార్టీ బలహీనంగా ఉంది. బలమైన నేతలున్నప్పటికీ జగన్ తీసుకుంటున్న చర్యలతో పార్టీకి ఓటు బ్యాంకు క్రమంగా తగ్గుతూ వస్తుంది. కర్నూలుకు న్యాయరాజధానిగా ప్రకటించడంతో పాటు రాయలసీమ ఎత్తిపోతల పథకం విస్తరణ ప్రాజెక్టుతో జగన్ కు మరింత గ్రాఫ్ పెరిగింది.రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో చంద్రబాబు ఎటూ తేల్చుకోలేక సతమతమవుతున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను తనను ఇబ్బంది పెట్టడానికే ఈ డ్రామా ఆడుతున్నారని ఆయన భావిస్తున్నారు. అందుకే కనీసం రాయలసీమ ఎత్తిపోతల పథకం సీమ నేతలు కూడా నోరు విప్పకుండా కట్టడి చేయగలిగారు. దీంతో సీమలో టీడీపీకి మరింత ఇబ్బందికరంగా మారింది. గత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో రాయలసీమలో జగన్ కు ఆధిక్యత దక్కింది.దీంతో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై జగన్ ను ఇరకాటంలో నెట్టే ప్రయత్నాన్ని చంద్రబాబు మొదలు పెట్టారు. ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు జగన్ కు లేఖ రాయడం చంద్రబాబు ఆలోచనే. రాయలసీమ ఎత్తిపోతల పథకం విస్తరణ పనులను నిలిపేయాలని టీడీపీ ఎమ్మెల్యేల చేత డిమాండ్ చేయిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలే ఈ లేఖ రాయడం, జిల్లాకు అన్యాయం జరుగుతుందని చెప్పడంతో ఆ జిల్లాలో పార్టీకి కొంత ప్లస్ అయ్యేలా చంద్రబాబు వ్యూహరచన చేశారంటున్నారు.గత ఎన్నికల్లోనూ ప్రకాశం జిల్లాలో టీడీపీ నాలుగు స్థానాలు దక్కాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండకుంటే ప్రకాశం జిల్లాకు నీళ్లు రావని, ఎడారిగా మారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలో టీడీపీకి బలమైన క్యాడర్ , ఓటు బ్యాంకు ఉండటంతో కనీసం దానినైనా కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే చంద్రబాబు టీడీపీ ఎమ్మెల్యేల చేత లేఖ రాయించారన్న టాక్ వినపడుతుంది. మొత్తం మీద ఒక చోట మైనస్ అయినా మరోచోట ప్లస్ అయ్యేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉంది.

# వామ్మో..అతిసార

రాజమండ్రి, జూలై 13, (న్యూస్ పల్స్)సామర్లకోట పరిసర ప్రాంతాల్లో అతిసార జాడలు కనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వాంతులు విరోచనాలతో బాదపడుతున్న కేసులు ఆసుపత్రిలో నమోదు అవుతున్నాయి. తాజాగా అతిసార బారిన పడిన ఇరువురు సామర్లకోట ప్రభుత్వ క్లస్టరు ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు పొందారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, కొద్దిపాటి వర్షాలు, గోదావరి కాల్వకు కొత్తనీరు రావడం, నీటి కలుషితం, ఆహార కాలుష్యం వంటి కారణాల వల్ల అతిసారం ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు నిత్యం పంపింగ్ చేస్తున్న గోదావరి రక్షిత జలాలను మరింతగా శుద్ధిచేసి క్లోరిన్, ఆలం శాతం మరింత పెంచి త్రాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. సామర్లకోట గోదావరి కాల్వ మూసివేత సమయంలో సమీప పరిశ్రమల కలుషిత జలాలు అదిక సంఖ్యలో గోదావరి కాల్వలో కలిసాయి. దాంతో మున్సిపాల్టీ నీటి శుద్ధిపై మరింత దృష్టిపెట్టాల్సి ఉంటుంది. అలాగే చిన్న చిన్న పైపులైన్ల లీకులు అరికట్టాలి. లేదంటే తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలున్నాయి. అలాగే ముందస్తు హెచ్చరికలు ప్రకటనలు చేసి ప్రజలను అప్రమత్తం చేయాలి. నిల్వమాంసం, చేపలు విక్రయాలపై దాడులు చేపట్టి నిరోధించాలి. కాగా సామర్లకోట పరిసర ప్రాంతాల్లో అడపాదడపా డయేరియా కేసులు నమోదవుతున్నాయని, ఈ విషయమై మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చెప్పారు. ముఖ్యంగా నిల్వ మాంసం చేపలు తినడం వల్ల, కలుషిత జలాలు తాగడం వల్ల డయేరియా భారిన పడే అవకాశాలున్నట్లు చెప్పారు. కేసులు సంఖ్య పెరగక ముందే అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని సూచించగా, మున్సిపల్ కమిషనర్ స్పందించి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రజలు నిల్వ మాంసం, చేపలు తినరాదని, నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. వాంతులు విరోచనలు అధికంగా అవుతుంటే వెంటనే ఆసుపత్రికి తరలిరావాలని సూచించారు. కాగా సీజనల్‌గా వచ్చే వ్యాదుల పట్ల ఇప్పటికే మున్సిపాల్టీ పరంగా అప్రమత్తంగా ఉండి చర్యలు చేపడుతున్నారు. నిత్యం గోదావరి జలాల శుద్ధిచేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నామన్నారు.

# భారీగా ప్రోత్సాహకాలు...కానీ

విశాఖపట్టణం, జూలై 13, (న్యూస్ పల్స్)క వైపే చూడు రెండవ వైపు చూడాలనుకోకు అని బాలయ్య సినిమాలో ఒక భారీ డైలాగ్ ఉంటుంది. అలాగే ఏపీలో కూడా జగన్ ఒక వైపే చూస్తూ ఇన్నాళ్ళు గడిపారు. రెండేళ్ళ పాలనలో చెప్పుకోవడానికి ఏముంది అంటే పంచుడే. డబ్బులు తెచ్చి కుమ్మరించడమే. లెక్కకు మిక్కిలిగా పథకాలను అమలు చేస్తూ వాటి పేర్లు కూడా అధికార పార్టీ నాయకులు మరచిపోయేటంతలా స్కీములను నడిపించారు. దీంతో విపక్షాలకు సైతం విసుగొచ్చి విమర్శలు సంధిస్తున్నాయి. అభివృద్ధి ఎక్కడా లేదని కూడా గట్టిగా గర్జిస్తున్నాయి.ఒక ప్రభుత్వం అంటే దాన్ని సమగ్రమైన రూపం కనిపించాలి. మనిషి తల వరకూ అందంగా ఉందని, కాళ్లూ చేతులు సన్నగా ఉంటే ఏం బావుంటుంది. ఇదే మేధావుల నుంచి వస్తున్న ప్రశ్న. మేము ప్రభుత్వ సమగ్రమైన రూపాన్ని చూస్తాం, మీలా ఒక వైపు చూసి బాగుంది అని చప్పట్లు కొట్టలేమని సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే గఫూర్ వైసీపీ నేతలకు ఈ మధ్య జరిగిన ఒక టీవీ చర్చలో గట్టిగానే ఇచ్చేశారు. ప్రభుత్వం అంటే కేవలం పంచుడు మాత్రమే కాదు అని ఆయన అభిప్రాయపడ్డారు. మరో వైపు చూస్తే జగన్ మీద మోజు తో మొదటి ఏడాది, కరోనాతో వచ్చిన సానుభూతితో రెండేళ్లు గడచిపోయాయి. జనాలు కూడా ప్రశ్నించలేదు. ఇపుడు మాత్రం అభివృద్ధి కావాలన్నది మెల్లగా నినాదంగా మారుతోంది.దీంతో జగన్ కూడా తప్పనిసరిగా ఆలోచించాల్సిన అవసరం అయితే ఏర్పడింది. జగన్ కూడా తన ప్రాధ్యాన్యతలను ఇలా అయిదేళ్ళకు పంచుకున్నారేమో అని కూడా అనిపిస్తుంది. తాను చెప్పిన మాటలను, ఇచ్చిన హామీలను మొదటి రెండేళ్ళు పూర్తి చేసి అభివృద్ధి మీద తరువాత సంవత్సరాలలో దృష్టి పెట్టాలని ఆయన ఆలోచించారని అంటున్నారు. సరిగ్గా ఇపుడు ఆ టైమ్ వచ్చేసింది. అందుకే ఏపీలో పారిశ్రామికరణకు అనుకూల వాతావరణాన్ని జగన్ సిద్ధం చేస్తున్నారు. తాజాగా జరిగిన మంత్రి వర్గ విస్తరణలో ఏకంగా ఏపీకి 12 వేల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులు వచ్చేలా పలు అనుమతులు ఇస్తూ కార్యాచరణను రూపొందించారు.ఇక ఏపీకి ఐటీ కళ కట్టాలంటే ప్రోత్సాహకాలు పెద్ద ఎత్తున ఇవ్వాల్సిందే అని జగన్ డిసైడ్ అయ్యారు.అందుకే ఐటీ పాలసీలో ఇన్సెంటీవ్స్ ని కుమ్మరించేశారు. అటు ఐటీ ఉద్యోగులు, ఇటు ఐటీ సంస్థలు కూడా మెచ్చుకునేలా ఉభయతారకంగా ఈ పాలసీని డిజైన్ చేశారు. ఏపీలో మూడు ప్రాంతాలలో ఐటీ రంగం గట్టిగా స్థిరపడేలా చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు చూస్తే పారిశ్రామికవేత్తలకు ఉదారంగా భూమి, నీరు, విద్యుతు అందించేందుకు కూడా జగన్ సర్కార్ రెడీ అవుతోంది.

# తెలుగు తిప్పలు

విజయవాడ, జూలై 13, (న్యూస్ పల్స్)తెలుగు భాషాభివృద్ధి కుంటుపడుతోందని ఒక వైపు భాషాభిమానులు బాధ పడుతున్న పరిస్థితి ఉంది. మరో వైపు కేవలం ఉపాధి కోసం చదువులు అన్నట్లుగా తయారైన విద్యా వ్యవస్థలో మాతృ భాషలో బోధన తగ్గిపోతోంది. నిష్టూరమైనా ఇదే నిజం. అందరికీ తెలుసు తెలుగుకు తెగులు పట్టిందని, కానీ కోరి మారీ ఆ నేరాన్ని తమ మీద వేసుకోవడమే వైసీపీ పాలకులు చేస్తున్న పని. జగన్ అధికారంలోకి వచ్చకా తెలుగు భాషలో ప్రాధమిక విద్యా బోధనకు స్వస్తి పలకాలని నిర్ణయించారు. అది అతి పెద్ద దుమారమే లేపింది. కోర్టులలో కూడా ప్రజావ్యాజ్యాలు పడ్డాయి. ఇపుడు దానికి తోడు అన్నట్లుగా మరో వివాదానికి వైసీపీ సర్కార్ తావిచ్చింది.విభజన జరిగి ఏడేళ్లు అయినా తెలుగు అకాడమి ఆస్తుల వ్యవహారం తేలలేదు. విజయవాడలో ఆఫీస్ పెట్టి ఏపీ తెలుగు అకాడమిని నిర్వహిస్తున్నారు. దీని మీద సుప్రీం కోర్టులో వ్యాజ్యం నడుస్తోంది. ఇదిలా ఉండగానే అకస్మాత్తుగా తెలుగు అకాడమి పేరుని జగన్ ప్రభుత్వం మార్చేసింది. తెలుగు సంస్కృత అకాడమీ అంటూ కొత్త పేరుతో జీవో రిలీజ్ చేసింది. దీంతో భాషాభిమానులు మండిపోతున్నారు. తెలుగుకు ఇదేం ప్రారబ్దం అని వారంతా మదన పడుతున్నారు. ఎంతో చరిత్ర ఉన్న అకాడమిని ఇలా చేయడమేంటి అని కూడా ప్రశ్నిస్తున్నారు.ఆరవ దశకంలో పీవీ నరసింహారావు తొలి అధ్యక్షుడిగా తెలుగు అకాడమీ మొదలైంది. ఆ తరువాత అనేక మంది పనిచేశారు. ఏటా వేలల్లో తెలుగు పుస్తకాలు ప్రచురిస్తూ తెలుగు వెలుగులు విరజిమ్ముతోంది. అటువంటి అకాడమీ పేరుని మార్చడం బాధాకరమనే అని అంటున్నారు. జగన్ ముందు తెలుగు చరిత్ర తెలుసుకోవాలని మాజీ మంత్రి మండలి బుద్ధ ప్రసాద్ అంటున్నారు. జనసేనాని కూడా వైసీపీ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. ఇపుడు అంత అవసరం ఏమొచ్చింది అని ఆయన ప్రశ్నించారు. ఒక వేళ సంస్కృత భాష మీద మోజు ఉంటే దానికి వేరే అకాడమీ ఏర్పాటు చేయవచ్చుగా అన్న మాట కూడా అంటున్నారు.తెలుగుదేశం పార్టీతో ఎపుడూ వైసీపీకి రాజకీయ పోరు ఉండనే ఉంది. ఇపుడు తెలుగు అన్న మాట వింటేనే సమరానికి తయారైపోతారా అంటున్నారు భాషాభిమానులు. పాఠశాలలు తెరచుకుంటున్న వేళలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వల్ల తెలుగును ఏం చేయదలచుకున్నారో ముందే చెబుతున్నారా అని నిలదీస్తున్నారు. తన పంతం నెగ్గించుకోవడానికి ప్రభుత్వ పెద్దలు ఏకంగా తెలుగు వైభవానికే చేటు తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే భాష, ప్రాంతం, కులం, మతం ఇవన్నీ బలమైన సెంటిమెంట్లే. వీటి జోలికి తెలిసి ఏ రాజకీయ పార్టీ పోదు. కానీ వైసీపీ సర్కార్ ఎందుకిలా చేస్తోంది అన్నది సొంత పార్టీలోనే చర్చగా ఉంది. ఈ పేరు మార్పు వల్ల ఒరిగేది ఏంటో కానీ భాషాభిమానుల మనోభావాలు దెబ్బ తింటున్నాయని, తెలుగు అంటేనే వైసీపీకి వెగటా అన్న భావన కూడా బలపడిపోతోందని విమర్శలు వస్తున్నాయి. మరి జగన్ దీని మీద పునరాలోచిస్తే బాగుంటుందేమో.

# నాయి బ్రాహ్మణులకు సముచిత స్థానం

## మంత్రి చెల్లుబోయిన

తాడేపల్లి తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యలయంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ సమావేశంలో బిసి సంక్షేమ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ సలహాదారులు సజ్జాల రామకృష్ణ రెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తదితరులు పాల్గోన్నారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉండే బిసిల 139 కులాల సమతుల్యత పాటించే ఏకైక పార్టీ వైసిపి. ప్రతి కులాల కష్టనష్టాలను పాదయాత్రలో స్వయంగా వైఎస్. జగన్మోహన్ రెడ్డి తెలుసుకొని పాలనలో అమలు చేస్తున్నారని అన్నారు.ప్రతి బలహీనవర్గాన్నికి ఆస్తులు ఉండవు...వృత్తులు ఉంటాయి. ఆ వృత్తులను ప్రోత్సహించి సంరక్షించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంది. కొన్ని పత్రికలు చేసే ప్రభుత్వంపై పని కట్టుకొని ఆసత్యలను ప్రచారం చేసే పనిలోనే ఉన్నాయి. ప్రతి బలహీన వర్గానికి చెందిన వ్యక్తికి ఇంత మొత్తంలో సంక్షేమ కార్యక్రమాలు అందచేస్తున్న ప్రభుత్వ పనితీరున ఆ పత్రికలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈలాంటి దుష్పచారాలను మన బలహీనవర్గాలు అందరూ కలిసి తిప్పి కొట్టాలి. ఆనాడు దుర్గ గుడి నాయి బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తాను అని చంద్రబాబు దుర్భాషలాడారు. అదే నాయి బ్రాహ్మణ మహిళను దుర్గ గుడిలో డైరక్టర్ చేసి వారి ఆత్మగౌరవం నిలిపిన నాయకుడు మన ముఖ్యమంత్రని అన్నారు.బలహీన వర్గాల ఆత్మగౌరవం నిలిపే దిశగా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రికి ఓ బలహీనవర్గానికి చెందిన వ్యక్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అబద్దాలు పెట్టుబడి పెట్టి చంద్రబాబులా కాలయాపన చేసే ప్రభుత్వంలో కాదు మనం ఉండేది. మన ముఖ్యమంత్రి పాదయాత్రలో 139 కులాల కోసం ఏవైతే హామీలు ఇచ్చారో వాటిని అమలు చేసే దిశగా పాలన కొనసాగిస్తున్నారు. ఓట్లు కోసం కాదు మన ముఖ్యమంత్రి ఆలోచించేది. మన భావితారాల భవిష్యత్తు గురించి మన ముఖ్యమంత్రి ఆలోచించేదని అన్నారు.

# నిండు ప్రాణాన్ని కాపాడిన హైవే పెట్రోలింగ్ సిబ్బంది

## మానవత్వాన్ని మరోమారు చాటుకున్న ఆలమూరు పోలీసులు.

రావులపాలెం గౌతమి గోదావరిలో మునిగిపోతున్న ఓ నిండు ప్రాణాన్ని ప్రాణాలకు తెగించి భారీ వర్షంలోనూ కాపాడి మరోమారు తమ మానవత్వాన్ని చాటుకున్నారు ఆలమూరు పోలీసులు. వివరాల్లోకి వెళితే రంగంపేటకు చెందిన కోటిపల్లి నవీన్ ద్విచక్రవాహనంపై రావులపాలెం వైపు నుండి జొన్నాడ వైపు గౌతమి పాత బ్రిడ్జిపై వస్తూ తన ద్విచక్ర వాహనాన్ని ఆపి అకస్మాత్తుగా బ్రిడ్జిపై నుండి గోదావరిలో దూకగా అటువైపు గస్తీ తిరుగుతున్న ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ తో పాటు హైవే పోలీస్ పెట్రోలింగ్ పైలెట్ జీ.వీ.వీ.ఎస్.మూర్తి, హెచ్ సీ ఆర్ఎస్వి రాజులు సంఘటనను గుర్తించి హుటాహుటిన గోదావరి గట్టుకు చేరుకొని భారీగా కురుస్తున్న వర్షంలో నావపై వెళ్లి ప్రాణాలకు తెగించి గోదావరి మధ్యలో మునిగిపోతున్న నవీన్ ను కాపాడగలిగారు. అయితే పాత కొత్త బ్రిడ్జిపై వెళ్తున్న ప్రయాణీకులు జరుగుతున్న సంఘటనను ఉత్కంఠగా పరిశీలించారు. కాగా నవీన్ విశాఖ డైరీ లో పని చేస్తున్నట్లు తెలియవచ్చింది. పోలీసుల్లో మానవత్వము ఉందంటూ పలువురు పోలీసులను కొనియాడారు. కాగా నవీన్ గోదావరిలోకి దూకడానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

# కొండల్ కుటుంబాన్ని పరామర్శించిన షర్మిల

వనపర్తి వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం తాటిపర్తి గ్రామంలో నిరుద్యోగ నిరాహారదీక్ష జరిగంది. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల నిరుద్యోగ నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. షర్మిల మాట్లాడుతూ సిఎం కేసిఆర్ మొద్దు నిద్ర నుంచి లేపటానికి ప్రతి మంగళవారం నిరుద్యోగ దినంగా,నిరసన దినంగా వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ప్రకటిస్తుంది. పార్టీ పెట్టకముందే నిరుద్యోగుల కోసం వారికి నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ మూడు రోజుల నిరాహార దీక్ష చేపట్టాను. ఉద్యోగుల పక్షాన పోరాటాన్ని ప్రారంభించాను. ఆ పోరాట స్ఫూర్తితో ప్రతి మంగళవారం నిరుద్యోగుల కోసం దీక్షలు చేపడతా. దేశంలోనే నిరుద్యోగులు అత్యధికంగా ఉన్న రాష్ట్రం తెలంగాణ. నిరుద్యోగ సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా సీఎం కేసీఆర్ దున్నపోతు పై వాన పడినట్లుగా వ్యవహరిస్తున్నాడు.. ఖాళీగా ఉన్న లక్షా 90 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. అంతకుముందు ఆమె ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కొండల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఐసీడీఎస్ ను కాపాడాలి

## కలెక్టరేటును ముట్టడించిన మహిళలు

నెల్లూరు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం,ఎపిలో వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కుట్రపూరితంగా వ్యవహరిస్తూ ఓ పథకం ప్రకారం ఐసిడిఎస్ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు ప్రారంభించాయని సిఐటియు అధ్వర్యంలో జరిగిన నిరసనకు మహిళలు పోటెత్తారు. అంగన్వాడీల అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో ఇటీవల విడుదల చేసిన 172 సర్క్యులర్ను తక్షణమే రద్దు చేయాలని, అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట భారీ స్థాయిలో అంగన్వాడీలు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. విఆర్సి నుంచి అంబేద్కర్ బొమ్మ మీదుగా కలెక్టరేట్ వరకు మహిళ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీ మెప్పుకోసమే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జాతీయ నూతన విద్యావిధానం 2020ని దేశంలోనే మొట్టమొదటి సారిగా రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారని విమర్శించారు. ముందుగా వి.ఆర్.సి క్రీడా మైదానం నుంచి అంగన్వాడీలు భారీ ర్యాలీ ప్రదర్శనగా బయలు దేరి కలెక్టరేట్కు చేరుకున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 172 సర్క్యులర్ అమలు చేస్తే 3 సంవత్సరాల పిల్లలు ప్రాథమిక పాఠశాలలకు, 3,4 తరగతుల విద్యార్థులు హైస్కూల్కు వెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రాథమిక విద్యకోసం విద్యార్థులు 3,4 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందన్నారు.దీని వల్ల పేద పిలలకు ముఖ్యంగా ఎస్సి,ఎస్టి, మైనారిటీ వర్గాలకు చెందిన బాలికలు చదువుకు దూరం అవుతారన్నారు. ఐసిడిఎస్ను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు .కరోనా సమయంలో మృతి చెందిన అంగన్వాడీల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల భీమా సౌకర్యం కల్పించా లన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగఅవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు చెందిన అంగన్వాడీలు భారీ సంఖ్యలో వచ్చారు.

# లండన్ లో నిరాడంబరంగా "టాక్ లండన్ బోనాల జాతర"



లండన్ జూలై 13 తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్డమ్ ( టాక్) ఆధ్వర్యం లో ప్రతీ సంవత్సరం మాదిరిగా ఘనంగా బోనాల జాతరనునిర్వహించారు.లండన్ వీధుల్లో తొట్టెల ఊరేగింపుతో తెలంగాణా సంస్కృతి సంప్రదాయాలని ప్రపంచానికి చాటిచెప్పేలా వైభవంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రజలంతా ఆరోగ్యంగా సంతోషంగా ఉండాలని కోరుకున్నామని, నేడు కరోనా మహమ్మారి ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న విషయం మనందరికీ తెలుసునని , టాక్ కార్యవర్గ సభ్యులు కోవిడ్ నిబంధనలను పాటిస్తూ స్థానిక గుడి లో అమ్మవారికి బోనాలను సమర్పించి అందరినీ చల్లగా చూడాలని, కరోనా నుండి ప్రజలని రక్షించాలని కోరుకున్నామని అధ్యక్షులు రత్నాకర్ కదుదుల ఉపాధ్యక్షురాలు శుష్మణ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం లో పాల్గొని బోనాలు సమర్పించిన ప్రతి టాక్ సంస్థ ఆడబిడ్డలందరికి శుష్మణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.చిన్న పిల్లలు టాక్ జెండాలతో , అమ్మవారి నినాదాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.చివరిగా టాక్ సభ్యులంతా ప్రజలు స్వీయ నియంత్రణ తో పాటు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోరారు, అలాగే అమ్మవారు ప్రజలందరినీ రక్షించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, ఉపాధ్యక్షురాలు శుష్మునా రెడ్డి,మల్లారెడ్డి,నవీన్ రెడ్డి,వెంకట్ రెడ్డి,స్వాతి , సుప్రజ,సురేష్ బుడగం, రాకేష్ పటేల్, సత్యపాల్ ,హరిగౌడ్ ,గణేష్, రవి రెటినేని, , రవి పులుసు,మాధవ్ రెడ్డి ,వంశీ వందన్ , భూషణ్, అవినాష్,వంశీ కృష్ణ ,పృథ్వీ ,శ్రీ లక్ష్మి, విజిత,క్రాంతి , భరత్ ,వంశీ పొన్నం , చింటూ ,రమ్య , స్వప్న,లాస్య, పూజిత ,బిందు ,మాధవి తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

# తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (అలయశుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించారు. సంవత్సరంలో నాలుగు పర్వదినాలైన ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మో?త్సవం, వైకుంఠ ఏకాదశి రోజుకు ముందు వచ్చే మంగళవారం ఈ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.16 వతేది సాలకట్ల అణివారి ఆస్థానం నిర్వహిస్తున్న సందర్భంగా మంగళవారం తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమనజనం నిర్వహించింది టీటీడీ.కరోనా వైరస్ సెకండ్ వేవ్ కారణంగా అతి తక్కువమందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది టీటీడీ . తిరుమంజనం అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు ఆలయ ప్రధాన అర్చకులు...అలాగే ఈ నెల 16 న జరిగే అణివారి ఆస్థానాన్ని వేడుకగా జరుపుతామని ....ఆలయ ఇఓ జవహర్ రెడ్డి మీడియాకు తెలిపారు

# ఏజెన్సీలో పొంగుతున్న వాగులు

ఏలూరు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమగోదావరిజిల్లా లోని ఏజెన్సీ ప్రాంతం లోని పలు మండలాల్లో గల కొండ వాగులు, అలివేరు,జల్లేరు, అశ్వారావుపేట వాగులు, పొంగి పొర్లుతున్నాయి. జీలుగుమల్లి, బుట్టాయిగూడెం, మండలాలకు సంబంధించిన పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో నిత్యావసర సరుకుల కోసం గిరిజనులు , గిరిజనేతరులు మండల కేంద్రాలకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండ వాగులు రహదారుల పై ప్రవహించటం వలన వైద్య అవసరాల కోసం జంగారెడ్డి గూడెం వెళ్లే వారు పలు ఇబ్బందులు పడుతున్నారు.108 వాహనం కూడా కొన్ని ప్రాంతాల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏజెన్సీ ప్రాంతాల్లో ఒక మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జీలుగుమిల్లి నుంచి బుట్టాయిగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న వాగులు పొంగడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.బుట్టాయిగూడెం మండలం కాపవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గుబ్బలమంగమ్మ గుడి సమీపంలోని అలివేరు వాగు ఉధృతం గా ప్రవహిస్తోంది. గుబ్బల మంగమ్మ ఆలయన్ని మూసివేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ఆలయనికి వెళ్లే రహదారి ని కూడ మూసి వేయడం జరిగింది పరిసర ప్రాంతాలలో ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, అధికారులు, ప్రజలను కోరుతున్నారు.

# ఎన్ఆర్ఈజీఎస్ పనుల బిల్లులు చెల్లించకపోవడం బాధాకరం

## కలెక్టర్లకు విన్నవించిన టిడిపి నాయకులు

నెల్లూరు టిడిపి హయాంలో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లించకపోవడం బాధాకరమని టిడిపి నాయకులు కలెక్టర్ ముందు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా నే ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టు చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించిన చిన్నాచితకా కాంట్రాక్టుల తో పాటు, బడా కాంట్రాక్టర్లు సైతం అధికశాతం వడ్డీలకు అప్పులు చేసి పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయిన ప్పటికీ ఎన్ఆర్ఈజీఎన్ వనులకు సంబంధించిన బిల్లు విషయంలో స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. కొంతమంది తెచ్చిన అప్పు కట్టేందుకు ఎంతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు .వారిలో కొంతమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్యలే శరణ్యం అంటున్నట్లు తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎన్ఆర్ఈజీఎస్ పనుల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు మరియు గ్రామీణ నియోజకవర్గ ఇన్చార్జి షేక్ అబ్దుల్ అజీజ్, నగర నియోజకవర్గ ఇన్చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి , మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీపీ...నాయకులు కావలెను

హైదరాబాద్, జూలై 13, (న్యూస్ పల్స్)తెలంగాణ తెలుగుదేశం పార్టీని భరించేందుకు నాయకులు కావాలి. కీలక నాయకులు, అధ్యక్షులుగా పని చేస్తున్నవారు సైతం ఫిరాయించేయడంతో పదవులిస్తాం. రమ్మంటూ తెలుగుదేశం పిలుస్తోంది. అయినా ఎవరూ సాహసించలేకపోతున్నారు. వేరే చోట స్థానం లేక, రాజకీయ భవిష్యత్తుపై పెద్దగా ఆశలు పెట్టుకోని నాయకులు మాత్రమే టీడీపీలో మిగిలారు. వారు కూడా ముఖ్య బాధ్యతలు తీసుకునేందుకు సిద్ధంగా లేరు. అయినా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికైతే ఇంకా రాష్ట్రంలో ఆశ చావలేదు. ఓటుకు నోటు కేసు వంటి స్వయంకృతాపరాధంతో పార్టీకి సమాధి కట్టేసి అయిదేళ్లు దాటిపోయింది. వరస తప్పిదాలతో తెలంగాణలో పార్టీ పరిస్థితి క్రమేపీ దిగజారిపోయింది. నిత్యం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కళకళలాడిన ఎన్టీయార్ భవన్ వెలవెల బోతోంది. 2004నుంచి 2014 వరకూ పార్టీ అధికారంలో లేకపోయినా ఇంతటి దుస్థితి ఎప్పుడూ లేదు. బీసీల పార్టీగా ముద్ర ఉన్న తెలుగుదేశానికి ఇంతటి దీనస్థితి రావడానికి నాయకత్వ లోపాలూ కారణమే. రాష్ట్ర విభజనతో పర నాయకత్వం అనే అంశం నుంచి బయటపడేందుకు అధిష్టానం కృషి చేయలేదు. కాంగ్రెసుతో పొత్తు పెట్టుకుని మరో పొరపాటు చేశారు. రేవంత్ వంటి వారు దూకుడు కనబరిచేందుకు తొలుత ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. క్షేత్రస్థాయిలో పార్టీకి ఊపు తీసుకురావడం సాధ్యం కాదని గ్రహించే కాంగ్రెసులోకి జంప్ చేసేశారు. ఇప్పుడు మళ్లీ పార్టీని పునరుద్ధరించి పురావైభవం తెస్తానంటున్నారు చంద్రబాబు నాయుడు.తెలంగాణ తెలుగుదేశం నిధుల కొరతను ఎదుర్కొంటోంది. ఇక్కడి నాయకులెవరూ చేతి నుంచి పైసా పార్టీ కోసం ఖర్చు పెట్టడానికి ఇష్టపడటం లేదు. నిన్నామొన్నటి వరకూ కొంత అధిష్టానమే సర్దుబాటు చేస్తుండేది. ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడి పార్టీ శాఖకు, ఎన్టీయార్ భవన్ నిర్వహణకు భారీగానే నిధులు సమకూర్చుతుండేది. దాంతో ఏదోరకంగా తెలంగాణలో పార్టీని బతికించేందుకు నాయకులు తీవ్రంగానే ప్రయత్నించారు. 2018 వరకూ వారిలో ఎంతో కొంత ఆశలుండేవి. కాంగ్రెసు, టీడీపీ సమష్టి ఓటమి తర్వాత ఒక్కొక్కరుగా నాయకులందరూ జారుకున్నారు. నిజానికి కార్యకర్తలు అంతకుముందే వేరే పార్టీల్లో సర్దుకున్నారు. ఎటొచ్చీ ఎటువంటి పదవులు ఆశించని పార్టీ సానుభూతిపరులు మాత్రం అక్కడక్కడ ఉన్నమాట వాస్తవం. ఈ స్థితిలో మళ్లీ పార్టీ నియోజకవర్గాలు, జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలంటే భారీ ఎత్తున నిధులు అవసరమవుతాయి. వాటిని సమకూర్చే పరిస్థితి కనిపించడం లేదు. అధికారాన్ని ఆశిస్తున్న ఆంధ్రప్రదేశ్ లోనే అధిష్టానం నుంచి నిధుల పంపిణీ సాగడం లేదు. స్థానిక నాయకులే పార్టీ కార్యక్రమాలకు అవసరమైన వనరులు సమకూర్చుకుంటున్నారు. ఇక తెలంగాణ సంగతైతే చెప్పనక్కర్లేదు. చంద్రబాబు నాయుడు పక్కా రాజకీయవేత్త. ఓటమి ముంగిట్లో కనిపిస్తున్నా, తానే గెలుస్తానని చెప్పగలడు. ప్రజలను , కార్యకర్తలను, నాయకులను నమ్మించగలడు. లేకపోతే ముందుగానే క్యాడర్ చేతులెత్తేస్తుంది. వైసీపీకి, టీడీపీకి మధ్య 12 శాతం మేరకు ఓట్ల వ్యత్యాసం ఉంది. అయినా పార్టీ గెలుస్తోందని చివరిక్షణాల వరకూ చెప్పడం వల్లే, 2019 ఎన్నికలలో టీడీపీ పోరాట పటిమను కనబరిచింది. ఇందుకు చంద్రబా బు నాయుడి వ్యూహచాతుర్యమే ప్రధాన కారణం. ఇప్పుడు తెలంగాణలోనూ పార్టీకి ఉజ&ర్జ్వల భవిష్యత్తు ఉందని చంద్రబాబు నమ్మబలుకుతున్నారు. మరో చరిత్ర లిఖించాల్సిన అవసరం ఉందంటున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత తాజాగా ఆయన తెలంగాణ పార్టీపై సమీక్ష నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు ఎల్. రమణ అధికార పార్టీలోకి వెళ్లిపోతుండటంతో తప్పనిసరిగా మరో నేతను ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఎల్. రమణ పార్టీని వీడినప్పటికీ ఒక్క కార్యకర్త కూడా ఆయన వెంట వెళ్లలేదంటూ సమర్థించుకొంటున్నారు.. నిజానికి అక్కడక్కడ నాయకులు తప్ప కార్యకర్తలు ఎప్పుడో ఖాళీ అయిపోయారు. అందుకే రమణ నిష్క్రమణ ప్రభావం పార్టీపై కనిపించలేదు. నైతికంగా మాత్రం అధిష్ఠానానికి ఇది పెద్ద దెబ్బే. విశ్వాసపాత్రులందరూ పార్టీకి దూరమయ్యారు. చంద్రబాబు నాయుడిని, తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను అభిమానించే వారు సైతం పార్టీలో ఉండటం వల్ల ఉపయోగం శూన్యమనుకుంటున్నారు. ఇక్కడ సాధించేదేమీ లేదనే భావనకు వచ్చేశారు.పార్టీకి జవసత్తువలు కల్పించాలనే ఉద్దేశంతో గడచిన రెండు మూడు రోజులుగా చంద్రబాబు నాయుడు కసరత్తు ప్రారంభిం చారు. వరస భేటీలు నిర్వహిస్తున్నారు. సమీక్షలతో పాటు వ్యక్తిగతంగా నాయకులతో విడిగానూ సమావేశమవుతున్నారు. నాయకులందరూ సమష్టిగా ఆయన చెప్పిందివింటున్నారు. అధినేతతో విడిగా సమావేశమైనప్పుడు మాత్రం బిన్నంగా స్పందిస్తున్నారు. త నిధులు వెచ్చించలేమంటూ తేల్చి చెప్పేస్తున్నట్లు సమాచారం. పెద్ద పదవులు తీసుకునేందుకు సాహసించడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రావుల చంద్రశేఖర్ రెడ్డి, కొత్త కోట దయాకర్ రెడ్డి వంటి ముగ్గురు నలుగురు సీనియర్లు మాత్రమే పార్టీకి మిగిలారు. వారు పార్టీలలో ఇమడలేమనే ఉద్దేశంతోనే టీడీపీలో కాలక్షేపం చేస్తున్నారు. తమకు రాష్ట్రంపైన, పార్టీపైన అవగాహన ఉన్నప్పటికీ పదవులు వద్దంటూవారు విముఖత ప్రదర్శిస్తున్నారు.యువనాయకత్వానికి అప్పగించాలంటూ తెలివిగా తప్పించుకుంటున్నారు. అధినాయకత్వమే ఆర్థిక వనరులుసమకూరుస్తూ , ఆపద్ధర్మ తెలంగాణ శాఖ అధ్యక్షుడిని నియమిస్తుందా? లేక బలవంతంగా సీనియర్లపైనే ఈ భారం మోపుతారా? అన్నది వేచి చూడాలి.

# బస్వాపురం రిజర్వాయర్ లో ఇద్దరు గల్లంతు

యాదాద్రి భువనగిరి భువనగిరి మండల పరిధిలో గల బస్వాపురం రిజర్వాయర్ లో ఇద్దరు యువకులు గల్లంతు అయ్యారు. సోమవారం సాయంకాలం ఇంటినుండి సరదాగా బయటకు వెళ్లిన యువకులు తరువాత కనిపించకుండా పోయారు. గల్లంతైన వారు భువనగిరి పట్టణం కిసాన్ కు చెందిన లింగాల హేమంత్ (14), సింగిరెడ్డి పవన్ కుమార్ (14). బస్వాపురం ప్రాజెక్టు వద్ద వారి చెప్పులు ఆగుపించడంతో డ్యామ్ వద్దకు చేరుకున్న పోలీసులు గాలింపు ప్రారంభించారు. మంగళవారం ఉదయం పవన్ మృతదేహం లభ్యం అయింది.

# జీజీహెచ్ లో శిశువుల తారుమారు కలకలం

కర్నూలు కర్నూలు జీజీహెచ్ లో శిశువుల తారుమారు కలకలం రేపింది. దేవనకొండ మండలం నెల్లిబండకు చెందిన రజియా అనే మహిళ మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఎన్ ఐ సియూలో చికిత్స అందిస్తున్నారు. రాత్రి ఎనిమిది గంటలకు శిశువు చనిపోయాడని ఆమెకు ఆసుపత్రి సిబ్బంది వెల్లడించారు. అయితే, పుట్టినప్పటి బిడ్డ, మృత శిశువు వేరు వేరుగా ఉన్నారని, తన బిడ్డను తారుమారు చేశారని రజియా ఆరోపించింది. బాలింత బంధువులు రాత్రి ఆసుపత్రిలో ఆందోళన కు దిగారు. ఆసుపత్రి అధికారులు విచారణ చేస్తున్నారు.

# ఏసీబీ కి పట్టుబడ్డ రాజాం ట్రాన్స్ కో ఏఈ

శ్రీకాకుళం రాజాం మున్సిపాలిటీ పరిధిలోని సారధి నుంచి అంతకాపల్లి కి వెళ్లే దారిలో వ్యవసాయం కోసం అవసరమైన ట్రాన్స్ఫార్మర్ వెయ్యడం కోసం రూ.80వేలు లంచం తీసుకుంటూ ఏఈ ఏసీబీ కి చిక్కిన సంఘటన రాజాం లో చోటుచేసుకుంది. సారధికి చెందిన టంకాల దిలీప్ అనే వ్యక్తి 10 రోజులు క్రితం తన పొలానికి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వెయ్యాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. ట్రాన్స్ఫార్మర్ మంజూరు చెయ్యాలంటే రూ.80వేలు లంచం ఇవ్వాలని ఏఈ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. దీంతో దిలీప్ శ్రీకాకుళం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. డీఎస్పీ ఏ వీ వీ రమణమూర్తి ఆధ్వర్యంలో రంగంలోకి ఏసీబీ అధికారులు నేరుగా రాజాం ట్రాన్స్కో ఏడీఈ కార్యాలయంలో దిలీప్ నుంచి లంచం తీసుకుంటున్న ఏఈ లక్ష్మణరావును రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని రాజాం పోలీస్ స్టేషన్ కి అప్పజెప్పి, కేసు దర్యాప్తు చేస్తామని డీఎస్పీ తెలిపారు

# నివాసయోగ్యమైన స్థలాలను ఎంపిక చేసుకుని ప్రభుత్వమే ఇళ్లను నిర్మించివ్వాలి ...టీడీపీ

## మాట మార్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురవుతున్న లబ్ధిదారులు

తుగ్గలి జూలై 13,( విభారె) నివాసయోగ్యమైన స్థలాలను మాత్రమే ప్రభుత్వం ఎంపిక చేసి,లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తుగ్గలి మండలంలోని 23 పంచాయతీలలో నివాసయోగ్యమైన స్థలాలలో స్వయంగా ప్రభుత్వమే ఇల్లులు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చి,ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులే ఇళ్లను కట్టుకోవాలని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని టిడిపి నాయకులు తెలియజేశారు.ప్రభుత్వం రోజుకొక మాట చెప్పి లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని వారు తెలియజేశారు.దీనితో పాటుగా విడతల వారిగా బిల్లులను ఇస్తామనడం చాల దారుణమని,ఇల్లు పేదవారు నిర్మించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలియజేశారు. ప్రస్తుతం కరోనాతో రైతులకు,కూలీలకు,భవన కార్మికులకు,చిరు వ్యాపారులకు పనులు లేక జీవిచడానికే కష్టంగా ఉంటే,ఇల్లు నిర్మిచుకోవడం ఎలా సాధ్యం అవుతుందని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కావున ఇళ్లను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరుతూ, అదేవిధంగా మండల వ్యాపంగా అనేక గ్రామ పంచాయతిలలో ప్రజలు నివసించడానికి పనికిరాని స్థలాలను ప్రభుత్వ అధికారులు ఎంపిక చేసారని వాటిలో శ్మసానాలను, వాగులను,వంకలను,కొండల వంటి స్థలాలను ఎంపిక చేశారని,ఇప్పటికైనా అధికారులు నివాసయోగ్య స్థలాలను ఎంపిక చేసి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేయాలని వారు తుగ్గలి తహసిల్దార్ కార్యాలయం నందు మంగళవారం రోజున రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు,ఉపాధ్యక్షుడు రాంపురం వెంకట రాముడు,తెలుగు యువత మండల అధ్యక్షులు గిరిగెట్ల సత్యప్రకాష్,చెన్నంపల్లి లక్ష్మీ నారాయణ తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారదర్శకంగానే పన్ను విధానం

## సమస్యల తక్షణ పరిష్కారం కోసం పర్యటన దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

గుడివాడ జూలై 13,( విభారె) ప్రజలను భయపెట్టేందుకు కావాలనే రాజకీయ పార్టీలు పన్ను విధానంపై దుష్టప్రచారం చేస్తున్నారని దేవదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం మంత్రి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 39 వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రఘవ మరియు అధికారులతో క్వారీ సెంటరు (కుమ్మరిపాలెం రోడ్ రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్) సంజయ్ గాంధీ కాలనీ, కామకోటినగర్, గుప్తా సెంటరు తదితర ప్రాంతాలు పర్యటించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజి సమస్య పరిష్కారించాలని పబ్లిక్ హెల్త్ మరియు నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. పశ్చిమ లోని 22 డివిజన్లు మోడల్ డివిజన్లు గా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం స్వచ్ఛా భారత్ లో భాగంగా మహిళలకు మూడు రకాల డస్ట్ బిన్ లను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే గద్దె కొన్ని రాజకీయ పార్టీలు కావాలనే పన్ను విధానంపై దుష్టప్రచారం చేస్తు, ప్రజలను భయందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఎవరికి, ఎటువంటి ఇబ్బంది లేని పన్ను విధానం అమలు చేయడం జరుగుతుందన్నారు. స్లాబ్ ప్రకారమే పన్ను ఉంటుందన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. పన్ను విధానంలో లోపాలను సరిచేయడంతో పాటు పారదర్శకంగానే పన్ను విధానం ఉంటుందన్నారు. కేంద్రంతో జతకట్టిన జనసేన అధ్యక్షులు పవన్కల్యాణ్ కేంద్రాన్ని ప్రశ్నించాలన్నారు. ప్రభుత్వ నిర్ణయం- మేయర్దేశంలో తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర వంటి చాలా రాష్ట్రాలల్లో పన్ను విధానం అమలు జరుగుతుందని, ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు గమనించాలని నగర మేయర్ శ్రీమతి రాయన భాగ్యలక్ష్మి . విజయవాడ అభివృద్ధికి సీఎం నిధులు కెటాయించడంలో నగరం అభివృద్ధిపథంలో దూసుకు వెళ్లుతుందన్నారు.. ఈ పర్యటనలో వైసీపీ శ్రేణులు, వివిధ విభాగాల అధికారులు ఉన్నారు.

# ఇండియాలో కరోనా సోకిన తొలి పేషెంట్ మళ్లీ కరోనా వైరస్

న్యూ ఢిల్లీ జూలై 13 ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి విషయం అంతుపట్టడం లేదు. దేనితో ప్రజలు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు.తాజాగా ఇండియాలో కరోనా సోకిన తొలి పేషెంట్ మళ్లీ ఆ వైరస్ బారిన పడింది. ఆమెకు తాజాగా మరోసారి పాజిటివ్‌గా తేలినట్లు ఆరోగ్య అధికారి వెల్లడించారు. చైనాలోని మెడికల్ కాలేజ్‌లో చదువుతున్న కేరళలోని త్రిసూర్‌కు చెందిన విద్యార్థిని దేశంలో తొలి కరోనా పేషెంట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఆమెకు లక్షణాలేమీ లేవని చెప్పారు. ఢిల్లీకి వెళ్లామనుకున్న ఆమె మరోసారి టెస్ట్ చేయించుకోగా పాజిటివ్‌గా తేలింది. ఆమె ప్రస్తుతం హోమ్ క్వారంటైన్‌లో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఇప్పటికే కరోనా వ్యాక్సిన్ తొలి డోసు తీసుకున్నట్లు చెప్పారు.2020 జనవరిలో ఆమెకు కరోనా సోకింది. దీంతో నెల రోజుల పాటు హాస్పిటల్‌లో ఉండి చికిత్స తీసుకుంది. ఆ తర్వాత ఆమెతోపాటు వుహాన్‌కు వెళ్లిన మరో ఇద్దరు స్నేహితురాళ్లకు కూడా పాజిటివ్‌గా తేలింది. గతేడాది జనవరి 27నుంచి ఫిబ్రవరి 20 వరకు ఆమె 24 రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉంది.

# కడచూపు కోసం ఎదురుచూపు

ఊరు మునిగిపోవడమంటే... ఒక మనిషి, ఒక సమాజం, ఒక సంస్కృతి ముగిసిపోవడం. మనుషులు ఊరొదిలి చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురైపోవడం. ఆ నిర్వాసిత విషాదం జీవితాంతం ప్రవాసమై వెంటాడుతుంది. అట్లా ప్రవాసులవుతున్న తెలంగాణ బిడ్డలెందరో. కుటుంబ బంగారు భవిష్యత్ కలగని... చివరకు కన్న తల్లికి, కట్టుకున్న భార్యకు, కడుపున పుట్టిన పిల్లలకు పుట్టెడు శోకాన్ని మిగిల్చి వెళ్లిపోతున్నవాళ్లనేకం. అలా భర్త ప్రాణం పోగొట్టుకుని.. కడచూపుకోసం కన్నీరు పెడుతున్న ఓ మహిళ కథ ఇది. నెలరోజులుగా వేల మైళ్ల అవతల, చల్లటి పెట్టెలో అతడి మృతదేహం... ఇక్కడ భర్తను పోగొట్టున్న భార్య.. కొడుకును పోగొట్టుకున్న తల్లి... తండ్రిని పోగొట్టుకున్న రెండు పసిప్రాణాలు... కళ్లనిండా నీళ్లతో క్షణమొక యుగంగా గడుపుతున్న తీరు. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం మారంపల్లి గ్రామం. 35 ఏండ్ల కిందట ఆ కుటుంబం వలస వచ్చిందక్కడికి. అంతుకుముందు కొన్నాళ్లు బొంబాయిలో ఉన్నారు. దానికంటే ముందు.. మగ్గిడి గ్రామం వాళ్లది. చేనేత కుటుంబం. కానీ... నేత ఎప్పుడో ఆ కుటుంబానికి దూరమయ్యింది. శ్రీరాంసాగర్ (పోచంపాడ్) ప్రాజెక్ట్ వచ్చింది. ఆ ప్రాజెక్టులో కుటుంబం నిర్వాసితమైంది. ధర్మపురి దగ్గర పునరావాస గ్రామం 'మగ్గిడి' ఏర్పాటయ్యింది. పునరావాసం.. ప్రవాసమే అయ్యింది. పిల్లలను తీసుకుని భర్త, భార్యా ఇద్దరూ కలిసి బొంబాయి పయనమయ్యారు. కానీ ఎన్నటికైనా వలస బతుకులు వలసబతుకులే. అందుకే మళ్లీ పుట్టిన నేలను వెతుక్కుంటూ వచ్చి చివరకు మారంపల్లిలో స్థిరపడింది కుటుంబం. సొంత ఇల్లు లేదు. గుంటెడు జాగ లేదు. కిరాయి బతుకులు. అలాంటి పరిస్థితుల్లోంటి బాధ్యతను తలకెత్తుకున్నాడు రెండో కొడుకు రమేష్. 20 ఏండ్ల కిందటనే... కుటుంబం కోసం దుబారు పయనమయ్యాడు. డ్రైవర్‌గా ఉద్యోగం. అప్పుడో ఇప్పుడో ఆయన పంపే పైసలు, ఇంటిదగ్గర ఉన్నవాళ్లు చేసే కూలీ.. ఆడ పిల్లల పెండ్లిళ్లు చేశారు. రెండు అర్రల మందం జాగ కొనుక్కున్నరు. రేకులేసుకున్నరు. ఎవ్వరికీ చదువులు సరిగ్గా లేవు. అందుకే చిన్న తమ్ముడైన రాజేశ్వర్‌ను చదివించాలని ఆయనకు కష్టం తెలియనివ్వలేదు. కానీ... ఐటీఐ అయిపోయిన తరువాత డిగ్రీ చదవడానికి కష్టమై... చివరకు రాజేశ్వర్ సైతం అన్నతోనే పయనమయ్యాడు. రమేష్‌కు ముల్లంగికి చెందిన లావణ్యతో పెండ్లయ్యింది. తరువాత అన్నదమ్ములిద్దరూ దుబారులో ఎనిమిదేండ్లు ఉన్నారు. వచ్చిన తరువాత... ఉన్న ఇల్లును తల్లికిచ్చి అన్నదమ్ములిద్దరికీ కలిసి.. ఇల్లు జాగ కొనుక్కున్నరు. తరువాత ఒక్కడే సౌదీలోని రియాద్‌కు పొయ్యిండు రమేష్. రెండేండ్లకోసారి రెండుసార్లు వచ్చిండు. ఏడాదిన్నర కిందట మళ్లీ పొయ్యిండు. ఈ సమయంలోనే ఒక సేట్ దగ్గరి నుంచి మరోసేట్ దగ్గరికి బదిలీ అయ్యిండు. రెండేండ్లకోసారి రెండు నెలలు.. రమేష్, లావణ్యకు ఇద్దరు ఆడపిల్లలు. శివాణి, పావని. వచ్చినప్పుడల్లా రెండు నెలలు ఉండిపోవడమే తప్పించి... దగ్గరుండి పిల్లల ముద్దు ముచ్చట చూసిందెన్నడూ లేదు. పిల్లలూ అంతే.. తండ్రి ప్రేమను ఆస్వాదించిందీ లేదు. వాళ్ల భవిష్యత్ బాగుండాలంటే... తను సొంత గడ్డ మీద ఉండాలనుకున్నడు. అందుకే ఇంకో ఆరు నెలలుండి వీసా అయిపోగానే... ఇండియాకు వచ్చేద్దామనుకున్నాడు రమేష్. అనుకున్నది అనుకున్నట్టుగా జరగలేదు. ఇంట్లో డ్రైవర్ ఉద్యోగం అంటే... 24 గంటల డ్యూటీ లెక్క. ఫిబ్రవరి 13న రాత్రి తొమ్మిదిగంటలప్పుడు ఫోన్ వచ్చింది. 'మేడమ్ రమ్మంటున్నరు' అని రూమ్మేట్స్‌తో చెప్పిన రమేష్... బయటికి వచ్చిండు. తరువాత ఏం జరిగిందో తెలియదు. చివరకు రోడ్డు ప్రమాదంలో గాయపడి.. ఆస్పత్రిలోచేరిండు. రెండు నెలల నరకయాతన తరువాత... ఏప్రిల్ 19న చనిపోయిండు. నెల రోజులు దాటిపోయింది. ఇప్పటివరకూ రమేష్ డెడ్‌బాడీ ఇండియాకు రాలేదు. చివరి రోజుల్లో దగ్గరలేక.. ప్రాణం పోయిన మనిషిని అక్కడ ఉంచుకుని ఇక్కడ నరకయాతన పడుతున్నది కుటుంబం. రమేష్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కోరుతూ కుటుంబ సభ్యులు మే 23న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ఎన్నారై విభాగాలను ప్రతివాదులుగా చేరుస్తూ మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. బాధితుల వేదన వర్ణనాతీతం.. ఉపాధి లేక వలసలు పోతున్న మన ప్రజలను చూసి కన్నీళ్లు పెట్టుకున్నాం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదాలుగా మన రాష్ట్రానికి సాధించుకున్నాం. కానీ ప్రవాస భారతీయుల సమస్యలపై, ప్రత్యేకించి గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులపై దృష్టి సారించు కోలేకపోయాం. గల్ఫ్ దేశాలలో మృతి చెందిన వలస కార్మికుల కుటుంబాలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆ కుటుంబాలు, కార్మికులకోసం పనిచేస్తున్న హక్కుల సంఘాలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. కానీ.. అందులో ముందడుగు లేదు. ఈ అయిదేండ్ల కాలంలో... గల్ఫ్ దేశాలలో తెలంగాణ ప్రవాసులు వెయ్యిమందికి పైగా చనిపోయారు. వివిధ కేసుల్లో చిక్కుకుని జైళ్లలో మగ్గుతున్నవారు ఎంతో మంది. ఆ బాధిత కుటుంబాల వేదన వర్ణనాతీతం. అప్పుడు శ్రీరాంసాగర్... ఇప్పుడు మల్లన్నసాగర్. ముంపు, నిర్వాసితం... పునరావృతమవుతూనే ఉన్నాయి. ఊరు మునిగింది. అది అంతర్గత వలసకు కారణమయ్యింది. తరువాత అంతర్జాతీయ వలస అయ్యింది. ఆ ప్రాజెక్టు ద్వారా నీరందుకున్న రైతులు బాగుపడ్డారు. భూముల ధరలు పదిరెట్లు పెరిగిపోయాయి. ముంపు నిర్వాసితులు మాత్రం భిక్షగాళ్లకంటే దీనంగా మారారు. ఈ ముఖచిత్రం మారాలి. సౌదీ విశాలమైన దేశం. భారతీయ జనాభా కూడా ఎక్కువ. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ కూడా భిన్నంగా ఉంటాయి.

# కాళ్లకు రంగు షూలు.. తలకు పచ్చటోపీ; నీ వేషధారణ చూడలేకపోతున్నాం

లండన్: టీమిండియా క్రికెటర్ ఇషాంత్ శర్మ ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఆగస్టు 4 నుంచి ప్రారంభం కానున్న టెస్టు సిరీస్‌కు ముందు భారత క్రికెటర్లు వినోదంలో మునిగి తేలుతున్నారు. తాజాగా ఇషాంత్ శర్మ గోల్ఫ్ ఆడడంపై యువీ తనదైన శైలిలో ట్రోల్ చేశాడు. అయితే యువీ ట్రోల్ చేసింది లంబూ ఆటను అనుకుంటే పొరపాటే... అతను ట్రోల్ చేసింది ఇషాంత్ వేషధారణను. కాళ్లకు రంగు షూలతో.. తలకు పచ్చ టోపీతో కాస్త వింతగా కనిపించిన ఇషాంత్‌ను c లంబూ జీ నీ వేషధారణతో మేము చచ్చిపోయేలా ఉన్నాం.. కాస్త ఆ గెటప్‌ను మార్చుc అంటూ ట్రోల్ చేశాడుకాగా ఇటీవలే కివీస్‌తో జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆడిన ఇషాంత్ మూడు వికెట్లు పడగొట్టాడు. అయితే ఈ మ్యాచ్‌లో టీమిండియా 8 వికెట్ల తేడాతో కివీస్ చేతిలో పరాజయం పాలైంది. అయితే ఈ ఓటమిని మరిచిపోయి టీమిండియా నూతనోత్సాహంతో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు సన్నద్ధమవుతుంది. కాగా ఇషాంత్ శర్మ కొన్నాళ్లనుంచి కేవలం టెస్టు ఫార్మాట్‌కు పరిమితమయ్యాడు. ఇటీవలే టీమిండియా తరపున 100 టెస్టు మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న ఆటగాడిగా ఇషాంత్ నిలిచాడు. ఓవరాల్‌గా ఇషాంత్ శర్మ 102 టెస్టుల్లో 306 వికెట్లు పడగొట్టాడు.

# చరణ్ కంటే శంకర్ కు 10 ఎక్కువే!



సౌత్ లో దిగ్గజ దర్శకుడిగా పేరున్న శంకర్ సినిమా అంటే కేవలం తమిళం.. తెలుగు భాషల ప్రేక్షకుల్లోనే కాకుండా పాన్ ఇండియా ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. పాన్ ఇండియా మూవీస్ కు పెట్టింది పేరు అయిన శంకర్ తన ప్రతి సినిమాను భారీ బడ్జెట్ తో చేస్తూ ఉంటాడు. ఇండియన్ 2 సినిమా కొన్ని కారణాలతో నిలిచి పోవడంతో ప్రస్తుతం రామ్ చరణ్ తో తెలుగు మరియు తమిళంలో ద్విభాష చిత్రంను తెరకెక్కిస్తున్నారు. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తున్న నేపథ్యంలో అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ కాంబో అధికారిక ప్రకటన వచ్చి చాలా రోజులు అయ్యింది. ఇండియన్ 2 వివాదం కారణంగా కాస్త వెనుక ముందు అయినా కూడా ఎట్టకేలకు శంకర్ కు కోర్టులో అనుకూల తీర్పు వచ్చింది కనుక ప్రీ ప్రొడక్షన్ వర్క్ ను ముగించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. శంకర్ దర్శకత్వంలో సినిమా అంటే బడ్జెట్ తో పాటు పారితోషికాలు కూడా భారీగానే ఉంటాయి. ముఖ్యంగా శంకర్ భారీ పారితోషికంను డిమాండ్ చేస్తాడని.. తాను కోరుకున్నట్లుగా నిర్మాతలు ఖర్చు చేయాల్సి ఉంటుంది అంటూ ఉంటారు. వీటన్నింటికి దిల్ రాజు ఓకే చెప్పి రంగంలోకి దిగి ఉంటాడు. శంకర్ పారితోషికం విషయంలో అస్సలు రాజీ పడడు అనే టాక్ ఉంది. అందుకే విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం రామ్ చరణ్ కంటే శంకర్ ఎక్కువ పారితోషికంను అందుకుంటున్నాడు. దాదాపుగా పది కోట్ల రూపాయలను చరణ్ కంటే శంకర్ అదనంగా దిల్ రాజు నుండి అందుక ుంటున్నాడని అంటున్నారు. చరణ్ కు సినిమా విడుదల తర్వాత లాభా ల్లో వాటా ఉంటుందని అం టున్నారు. సినిమా మిని మంగా సక్సెస్ అయినా కూడా చరణ్ కు భారీ మొత్తంలోనే లాభాల్లో వాటా దక్కుతుంది అంటున్నారు. తద్వార శంకర్ పారితోషికంతో మ్యాచ్ చేస్తాడని అంటున్నారు. ఇక శంకర్ ఈ సినిమా వర్క్ ను వచ్చే ఏడాది చివరి వరకు పూర్తి చేసేలా ఒప్పందం చేసుకున్నారట. ఏడాది కాలంలో సినిమాను పూర్తి చేసి వి డుదల కు సిద్దం చేయా లని.. లేదంటే పారితోషికం లో కోత లేదంటే లీగల్ యాక్షన్ ఉంటుందని కూడా గుసగుసలు వినిపిస ్తున్నాయి. 2023 లో సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా తో చరణ్ వ ంరో సారి పాన్ ఇండియా ప్రేక్షకుల ముందుకు వెళ్లే అవకాశం దక్కిం చుకున్నాడు. త్వరలోనే ఈ సినిమా షూట ింగ్ కార్యక్రమాలు ప్రారంభం కాబోతున్నాయి.

# అల్లుడి దర్శకత్వంలో సూపర్ స్టార్ సినిమా..?

సూపర్ స్టార్ రజనీ కాంత్ ప్రస్తుతం మాస్ డైరెక్టర్ శివ దర్శకత్వంలో "అన్నాత్తే" సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రజినీ తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేశాడు. తలైవా కెరీర్ లో 168వ చిత్రంగా వస్తున్న 'అన్నాతే'.. దీపావళి కానుకగా నవంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే దీని తర్వాత రజినీ చేయబోయే ప్రాజెక్ట్ ఎంటనేది ఇంత వరకు క్లారిటీ రాలేదు.రజనీకాంత్ ఆ మధ్య రాజకీయాల్లోకి వస్తున్నానని ప్రకటించడంతో సినిమాలకు స్వస్తి పలకబోతున్నారని అభిమానులు భావించారు. అయితే ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాజకీయాల్లోకి రావడం లేదని సూపర్ స్టార్ ప్రకటించడంతో.. తదుపరి సినిమాలపై అందరిలో ఆసక్తి మొదలైంది. ఈ నేపథ్యంలో ఓ తమిళ మీడియా కథనం ప్రకారం రజినీకాంత్ రెండు చిత్రాలకు కమిటయ్యారట. అందులో ఒకటి తన అల్లుడు స్టార్ హీరో ధనుష్ దర్శకత్వంలో చేయనున్నారట.హీరో ధనుష్ 'పవర్ పాండి' అనే సినిమాకి దర్శకత్వం వహించారు. ఈ సినిమా తమిళ్ లో మంచి సక్సెస్ అందుకుంది. ఈ క్రమంలో అతి త్వరలోనే దర్శకుడిగా రెండో చిత్రాన్ని ప్రారంభిస్తానని ధనుష్ ఇటీవల వెల్లడించారు. అయితే ఈ సినిమా రజినీకాంత్ తోనే ఉంటుందని అంటున్నారు. రజనీ కుమార్తెలు ఐశ్వర్య - సౌందర్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారట.



ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆగాల్సిందే.అయితే ధనుష్ ప్రస్తుతం హీరోగా ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇటీవల 'జగమే తంత్రం' చిత్రంతో పలకరించిన స్టార్ హీరో.. 'అత్రాంగి రే' అనే హిందీ మూవీతో పాటుగా 'ది గ్రే మ్యాన్' అనే హాలీవుడ్ మూవీ షూటింగ్ పూర్తి చేశారు. ప్రస్తుతం కార్తీక్ నరేన్ దర్శకత్వంలో 'ధ43' షూటింగ్ లో పాల్గొంటున్నాడు ధనుష్. ఇదే క్రమంలో తన అన్న సెల్వరాఘవన్ దర్శకత్వంలో 'యుగానికొక్కడు 2'.. మిత్రన్ డైరెక్షన్ లో ఓ మూవీ చేయనున్నాడు. ఇదే క్రమంలో శేఖర్ కమ్ముల తో ఓ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ చేసాడు. వరుస సినిమాలను లైన్ లో పెట్టిన ధనుష్.. ఇప్పుడు వీలు చూసుకొని తన మామ రజనీ ని డైరెక్ట్ చేస్తాడో లేదో చూడాలి. ధనుష్ ఇంతకముందు రజనీ నటించిన 'కాలా' చిత్రానికి నిర్మాతగా వ్యవహరించిన సంగతి తెలిసిందే.ఇకపోతే 'కనులు కనులను దోచాయంటే' ఫేమ్ దేశింగ్ పెరియసామి దర్శకత్వంలో రజనీకాంత్ ఓ సినిమా చేయనున్నాడని ఆ మధ్య వార్తలు వచ్చాయి. అయితే దర్శకుడు దీనిపై స్పందిస్తూ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి వస్తున్న వార్తలు నిజం కాదని ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో రజనీ తో 'చంద్రముఖి 2' సినిమా చేయాలని దర్శకుడు పి. వాసు ఎప్పటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. రజనీ వీరాభిమాని రాఘవ లారెన్స్ కూడా ఈ సీక్వెల్ సినిమా గురించి సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చారు.పి.వాసు - సూపర్ స్టార్ కాంబోలో రాబోయే 'చంద్రముఖి 2' సినిమాలో నటిస్తున్నానంటూ లారెన్స్ వెల్లడించారు. సన్ పిక్చర్స్ బ్యానర్ పై కాలానిథి మారన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారని పేర్కొన్నాడు. అయితే రజనీ ఏ సినిమా ముందు సెట్స్ పైకి తీసుకెళ్లాడు అనే దానిపై స్పష్టత లేదు. 'అన్నాత్తే' మూవీ విడుదలైన తర్వాత తలైవా తదుపరి సినిమా ఎంటనేది తెలిసే అవకాశం ఉంది. కాగా 'అన్నాత్తే' షూటింగ్ ముగించిన తర్వాత రజనీ కాంత్ రొటీన్ హెల్త్ చెకప్ కోసం యూఎస్ వెళ్లిన విషయం తెలిసిందే. అయితే ఇటీవలే ఆయన అమెరికా నుంచి చెన్నైకి తిరిగి వచ్చారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# 6 ఏళ్ల 'బాహుబలి'.. సోషల్ మీడియాలో ప్రభాస్ స్పెషల్ పోస్ట్..!

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కి దేశవిదేశాల్లో గుర్తింపు తెచ్చిపెట్టిన సినిమా ''బాహుబలి''. ఈ సినిమాతో టాలీవుడ్ స్టార్ కాస్తా పాన్ ఇండియా స్టార్ గా మారిపోయాడు. ఇండియన్ సినిమా హిస్టరీలో హయ్యెస్ట్ కలెక్షన్స్ సాధించిన 'బాహుబలి '.. తెలుగు సినిమా సత్తా ఏంటో ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పింది. దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన ఈ వెండితెర అద్భుతం.. ఎన్నో రికార్డులను చెరిపేసి సరికొత్త రికార్డులను నమోదు చేసింది. సౌత్ సినిమాలకు కొత్త దారిని చూపించిన ఈ చిత్రం.. 'బాహుబలి - బిగినింగ్' ఉ 'బాహుబలి - ది కన్క్లూజన్' అనే రెండు భాగాలుగా వచ్చి అశేష ప్రజాదరణ తెచ్చుకుంది.'బాహుబలి-1' చిత్రం 2015 జూలై 10న విడుదలైంది. అంటే సరిగ్గా నేటికి 6 ఏళ్ళు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో తనకు ఓవర్ నైట్ స్టార్డమ్ ని తెచ్చిపెట్టి ఇండియాలోనే బిగ్గెస్ట్ స్టార్ ని చేసిన 'బాహుబలి' చిత్రాన్ని ప్రభాస్ గుర్తు చేసుకుంటున్నాడు. సోషల్ మీడియాలో 'బాహుబలి' లో శివలింగం ఎత్తుకునే ఐకానిక్ ఫోటోని షేర్ చేశాడు డార్లింగ్. .. దేశవ్యాప్తంగా మరియు ప్రపంచవ్యాప్తంగా సినిమాటిక్ మ్యాజిక్ తరంగాలను సృష్టించిన చిత్ర బృందం ఇక్కడ ఉంది" అని పోస్ట్ చేసిన ప్రభాస్.. 'బాహుబలి' చిత్రానికి వర్క్ చేసిన వారందరినీ ట్యాగ్ చేశారు ప్రభాస్.పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన 'బాహుబలి' సినిమా రూ.500 కోట్లకు పైగా వసూలు రాబట్టింది.



'మహేంద్ర బాహుబలి' 'అమరేంద్ర బాహుబలి' రెండు పాత్రల్లో ప్రభాస్ నటించగా.. భల్లాల దేవుడిగా రానా - దేవసేన గా అనుష్క - అవంతిక గా తమన్నా - శివగామిగా రమ్యకృష్ణ - కట్టప్ప గా సత్యరాజ్ - బిజ్జల దేవుడిగా నాజర్ నటించారు. రాజమౌళి తండ్రి ప్రముఖ దర్శకరచయిత విజయేంద్ర ప్రసాద్ ఈ చిత్రానికి కథ అందించారు. కీరవాణి సంగీతం సమకూర్చగా.. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించారు. కోటగిరి వెంకటేశ్వర రావు ఎడిటింగ్ వర్క్ చేశారు. దర్శకుడు కె.రాఘవేంద్రరావు సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్ పై శోభు యార్లగడ్డ - దేవినేని ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# పుష్ప సీక్రెట్స్.. మారేడుమిల్లి అడవుల్లో ఏం జరుగుతోంది?

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ - సుకుమార్ కలయికలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా యాక్షన్ చిత్రం 'పుష్ప'. ఇంతకుముందు తూ.గో జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఈ సినిమాకి సంబంధించిన కీలక షెడ్యూల్ ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే. అనంతరం సెకండ్ వేవ్ వల్ల షూటింగుకి బ్రేక్ పడింది.ప్రస్తుతం షూటింగులతో పరిశ్రమ స్వింగ్ లోకి వచ్చింది. ఈ వారం ప్రారంభంలో హైదరాబాద్ లో ఈ చిత్రం మొదటి భాగం కోసం పెండింగ్ షూటింగ్ ను తిరిగి ప్రారంభించారు. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఇతర ప్రధాన తారలపై కీలక సన్నివేశాలను తాజా షెడ్యూల్ లో చిత్రీకరించనున్నారు. 'పుష్ప' హైదరాబాద్ షెడ్యూల్ జూలై చివరి నాటికి ముగుస్తుంది. తుది షెడ్యూల్ కోసం ఈ బృందం ఆగస్టులో తూర్పు గోదావరి జిల్లాలోని 'మారేడుమిల్లి' అటవీ ప్రాంతానికి తిరిగి వెళ్తుంది. సుమారు 15 రోజుల పాటు చిత్రీకరణ సాగుతుంది. తుది షెడ్యూల్ లో హై ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్ లు సహా కొన్ని పాటలను చిత్రీకరిస్తారు.'పుష్ప'లో మాలీవుడ్ స్టార్ ఫహద్ ఫాసిల్ విలన్ గా నటిస్తుండగా.. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ - ముత్తంశెట్టి మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. దేవీశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆర్య తర్వాత మళ్లీ ఆ రేంజులో ఆల్బమ్ ని ఈ మూవీ కోసం రెడీ చేస్తున్నారని సమాచారం.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190